విక్రమోర్వశీయనాటకము.

కాళిదాసకవి విరచితమైన

సంస్కృతనాటకమునుండి

రాజమహేంద్రవరంబున

దొరతనమువారి మొదటితరగతి బోధనాభ్యాసన పాఠశాలయందుఁ

ద్వితీయాంధ్రోపాధ్యాయుండగు

వడ్డాది సుబ్బరాయనిచేతఁ

తెలిఁగింపఁబడినది.

రెండవకూర్పు 2000 ప్రతులు.

రాజమహేంద్రవరము.

అయ్యగారి బాపిరాజుగారిచే శ్రీవిద్యానిలయ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1912.

వెల 0 8 0.]

[కాపీ-రైట్.

వసురాయకవికృత గ్రంథమాల.

1. అభిజ్ఞానశాకుంతలనాటకము. (టీకాసహితము) 1 0
2. వేణీసంహారనాటకము. (రౌద్రరసప్రధానము) 0 14
3. మల్లికామారుతప్రకరణము. (ఆటాంకములవఱకు గవి యొక్క చిత్రపటముతో నున్నది.) 0 14
4. ప్రబోధచంద్రోదయము (శాంతరసప్రధానము) 0 10
5. చండకౌశికనాటకము (హరిశ్చంద్రకథ) 0 8
6. విక్రమోర్వశీయనాటకము (శృంగారరసప్రధానము) 0 8
7. సూక్తివసుప్రకాశకము (లోకదృష్టాంతసమన్విత నీతిబోధకపద్యగ్రంథము.) 0 10
8. సుగుణప్రదర్శకము 0 4
9. భక్తచింతామణి 0 4
10. భగవత్కీర్తనలు 0 1
11. నందనందనశతకము (విష్ణుభక్తులకానందకరము) 0 1
12. దైవభక్త్యుపన్యాసము 0 2

. ఆంధ్రమేఘసందేశము 0 5

4. భామినీవిలాసము [పండితరాయవిరచితమునకు తెలుగు] 0 10

5. సూర్యశతకము (మూలశ్లోకములతోఁ గూడనున్నది) 0 6

16. సతీస్మృతి (కరుణరసభూయిష్ఠము) 0 4
17. సుతస్మృతి (అపదుద్ధారకశతకముతో నున్నది.) 0 4
18. గౌతమీమాహాజలమహిమానువర్ణనము, గోదావరి నౌకావిహారము చాటుప్రబంధము; 2 చంపకమాలికలుగలది. 0 2
19. సుమనోమనోజ్ఞము (భారతవచనము 1 వ భాగము) 0 7
20. డిటో (2 వ భాగము) 0 9
21. డిటో (3 వ భాగము) 0 8

పై గ్రంథములు వలయువారు వడ్డాదిసుబ్బారాయకవిగ

రాజమహేంద్రవరమున వ్రాసికొనవ

పీఠిక.

ఈగ్రంథముఁ గవికులసార్వభౌముం డగుకాళిదాసు సంస్కృతభాషయందు రచియించినాఁడు. ఇది శృంగారరసప్రధాన మయినది. ధీరలలితనాయకగుణ సంపన్నుఁడును, చంద్రవంశసముత్పన్నుండును నగు పురూరవశ్చక్రవర్తి దీనికిం గథానాయకుండు. విక్రమశాలి యగునయ్యేలికను, వేలుపువెలఁది యగునుర్వశిని గూర్చి యొనర్చినది గావున, నిది విక్రమోర్వశీయ మని, విక్రమోర్వశి యని వాడఁబడును. రూపకములలో నాటకము మొదటి దగుటను, దక్కినవానియందుఁ గూడఁ దఱుచుగ దానిలక్షణములే పట్టుచుండుటను, దీనికిఁ గూడఁ దన్నామమున సామాన్యవ్యవహారంబు గలిగియున్నను, దివ్యమానుష సంశ్రయం బయి, యయిదంకములు గల దగుటంబట్టి, యీవిక్రమోర్వశీయమును నాటి కాద్యష్టాదశోపరూపకములలోని త్రోటక మని విశేషజ్ఞు లగుమనీషులు పేరుకొందురు.

ఈప్రబంధమునకుఁ గథానాయకుం డగునప్పురూరవుండు, తీర్థరాజం బగు ప్రయాగంబునంతరాళంబునఁ బ్రతిష్ఠానపురంబున నధివసించి, నిఖిలజనరంజనంబుగా నిలాపాలనంబు సేయుచుండెను. ఆపృథివీశుం డొక్కనాఁ డరద మెక్కి యక్కడక్కడ విహారంబు సలుపుచుండఁ, గుబేరభవనంబునుండి మరలివచ్చుచు మార్గమధ్యమునఁ గేశి యను రక్కసునిచేతఁ జెఱపట్టఁ బడినతమప్రాణసఖి యగునుర్వశికొఱకై యేడ్చుచున్నరంభాద్యప్సరసల యార్తప్రలాపంబు లతనివీనులకు వినవచ్చెను. తోడనే యార్తత్రాణైకపరాయణుఁ డగునాధరణీరమణుం డవ్వేల్పుఁదరుణుల నూఱడించి యాక్రూరరక్కసు నుక్కడంచి, యుర్వశిని విడిపించి తెచ్చి, యామెనెచ్చెలులకు సమర్పించెను. తత్కారణంబుగా నది మొద లమ్మదవతి యాక్షితిపతియందు మనసు దగిలి, యనన్యాయత్తచిత్తంబునఁ దద్ధ్యానంబును సలుపుచుండెను.

ఇట్లుండునంతఁ గొండొకకాలంబున నింద్రసభయందు లక్ష్మీస్వయంవర మనునొక నాటక మాడవలసివచ్చెను. అందు లక్ష్మీవేషమును ధరించినయీయుర్వశిని వారుణీభూమికాధారిణి యయినమేనక "నీ డెందమెవనియందుఁ దగిలియున్నది" యని యడుగఁ, "బురుషోత్తమునియందు" ననవలసినది "పురూరవునియందు" నని బదులు పలికెను. అది విని తత్క్షణంబ శిక్షకుం డగుభరతముని గినిసి "నీవు మానుషివి గ"మ్మని దానికి శాప మిచ్చిన, నచ్చెలువ తన్మోక్షణంబుకొఱకై తన్ను వేఁడుకొనినం గనికరించి యింద్రుండు "నా సమరసహాయుం డగునప్పురూరవునిం గుమారకుఁ డుదయించువఱకుఁ బొందియుండు"

మని యనుగ్రహించినఁ, బ్రసాదం బని యయ్యాశీ, యయ్యాశ్వాసనకు హృదయేశ్వరి యయ్యె. అనునీకథయే యీత్రోటకమున నెంతో చమత్కారముగా నుజ్జీవింపఁజేయఁ బడెను. సంస్కృతపుఁబ్రతులలోఁ బాఠభేదము లనేకము లున్నవన్నయంశము విమర్శకు లెఱుంగకపో రని నమ్ముచున్నాను.

నే నిప్పటి కయిదాఱు సంవత్సరములక్రిందట, వేణీసంహారనాటకమును దెనిఁగించిన తరుణమున నే దీనినిగూడ నాంధ్రీకరించితిని గాని, దానినిబోలె దీనిని బ్రయోగించి చూచుటమాత్ర మెన్నఁటికిని దటస్థించినదికాదు. ఇందలిపాత్రములు పెక్కు లంతరాళమునఁ బ్రవేశింపవలసిన వగుటచేత, దీనిప్రయోగ మెల్లరకును సులభసాధ్యము కాదు గాని, సాధ్య మయినచో మాత్రము సర్వవిధములను సభ్యుల నానందపరవశులను జేయఁ జాలు ననుటను సందేహము లేదు. ప్రయోగకుశలులు రసికతల్లజుల యుల్లంబులను దీని మూలమునఁ బల్లవింపం జేయుదురు గాక. 1883 సం॥ అక్టోబరు. వ॥ సు

ద్వితీయముద్రణపీఠిక.

ఈనాటకము మొదటికూర్పుప్రతులు పదిపండ్రెండు సంవత్సరముల క్రిందటనే నిశ్శేషముగా వ్యయపడినవి. అప్పటినుండియు నాంధ్రదేశమునానాముఖములనుండి యవిరామముగ నీపొత్తముకొఱకు ననేకులు రసజ్ఞులు నాకు వ్రాయుచున్నారు, అయినను బునర్ముద్రితము గావించుటలో నేను శీఘ్రముగ శ్రద్ధచేయనికారణమునఁ జదువరుల కీనాటకము దుర్లభ మగుచుండెను. జనానురాగమునకుఁ బాత్ర మయినగ్రంథము నిట్లుపేక్షించుట మంచిది కాదని యీసంవత్సరము దీనిని మరల నచ్చొత్తించితిని.

మొదటికూర్పు ప్రతులు చెన్నపురియం దచ్చు పడినవి. అచ్చుచిత్తులు నేను దిద్దుటకు వీలు చిక్కనికతమున వానియందు బహువిధస్ఖాలిత్యములు దొడరినవి. వానిని బునర్ముద్రణమున నేను సవరింపఁ దలంపుగొని యుండఁగాఁ, గీర్తిశేషులయిన గొల్లపూడి రామదాసు బి. ఏ గారు విమర్శరూపమునఁ గొన్నిచోట్ల శక్తికొలఁది నాయుద్యమమునకుఁ దోడు సూపిరి. అందులకుఁ గృతజ్ఞుండ నయి వారియాత్మకు నిత్యసుఖమును గోరుచు నీద్వితీయముద్రణమున నాయాంధ్రీకరణమును వెండియు మూలముతోఁ బోల్చి యుచితములయినసవరింపులఁ బద్యగద్యములయందుఁ గొన్నిచోట్లఁ గావించితిని. పుస్తకముల కొఱకు బహుదేశములనుండి వ్రాసి వ్రాసి విసిగియున్నచదువరుల డెందముల కింక నీగ్రంథ మానందము గలిగించుఁ గాక.

1 ఏప్రిలు 1912 సం॥రం.

వడ్డాది సుబ్బారాయఁడు
రాజమహేంద్రవరము

శ్రీపరమాత్మనే నమః

ఇష్టదేవతా ప్రార్థనాదికము.

శ్రీలసఁ బుట్టుపట్టుఁ, దనుఁ జేరుబుధాళికిఁ జెట్టుఁజెట్టు, ధీ
శాలులగుట్టుమట్టు, భవసాగర మీఁదుక మెట్టుగట్టు, బ
ల్గోపులకామ్రగుళ్ళనుడీగొట్టు, జగంబులకట్టు, ధర్మము
న్రాల్గఁగ నీనిపట్టు, నఘనాగవిరట్టు, విరట్టుఁ గొల్చెదన్.

ఉ. పూవులు గ్రుచ్చుమాలకరపోలికఁ దావు లెఱుంగుచున్, రసా
జ్ఞేనకశబ్దరాజిఁ గృతిశేఖరముల్ రచియించుసత్కవుల్,
కేవలతద్విసగ్రహణకృత్యమునందు మిళిందచాతురిన్
బావనసాహితిం దనరుపండితు లందుఁడు మన్నమస్కృతుల్.

చ. దిరిసెపుఁబూలమాదిరి సతిమ్రదిమంబులు కాళిదాసస
త్తురరసనం జనించినపదంబు లి వంటినఁ గందు నాక, తెం
పరినయి తెల్గులోనికిని మార్పఁ దలంచితి విక్రమోర్వశిన్,
సరళపుఁద్రోటకంబు రససంభరితం బిది యే మొనర్తునో.

ఆ. వె. ముందు నేను మేఘసందేశ మాంధ్రీక
రించి, కొంచె మలవరించుకొన్న
పరిచయం బొకింత పని సేయకున్నె యీ
విక్రమోర్వశీయవిరచనమున?

సుగంధి. ప్రక్రమంబు దప్పి యర్థభంగ మైన, నింక నే
వక్రతల్ గనంగఁబడ్డ, వానిఁ దెల్పరే సుధీ
చక్రవర్తులారా! నేను సంస్కరించుకొందు నీ
విక్రమోర్వశీయమందు వేఱువేఱుకూర్పులన్.

క. అని యిష్టదేవతా నే
వనమును, విద్వత్కవిస్తవనమును, విజ్ఞా
పనమును, మాతృకగుణభా
వన మొనరిచి రచనసలుపు వ॥ సు॥ రాయండన్.

ఈనాటకమున వచ్చుముఖ్యపాత్రములు.

పురుషులు.

రాజు—కథానాయకుఁ డయినపురూరవుఁడు.

చిత్రరథుఁడు—ఊర్వశిని విడిపించుకొనివచ్చుట కిందుఁనిచేఁ బంపఁబడిన గంధర్వ సేనాధిపతి.

విదూషకుఁడు—పురూరవుని వేడుక చెలికాఁడు.

పైలవుఁడు
గాలవుఁడు } —భరతమునిశిష్యులు.

కంచుకి—పురూరవునియంతఃపురమున నుండువాఁడు.

కుమారుఁడు—పురూరవునికొడు కగునాయువు.

నారదుఁడు—దేవఋషి.

స్త్రీలు.

ఊర్వశి—కథానాయిక యగునప్సరస.

రంభ
మేనక
సహజన్య } ఊర్వశీసఖు లగునప్సరసలు.

దేవి—పురూరవునిపట్టమహిషి.

నిపుణిక—దేవికిఁ బరిచారిక.

తాపసి—చ్యవనాశ్రమమునుండి కుమారునిఁ దీసికొనివచ్చిన వృద్ధురాలు.

వీరును మఱికొందఱు పరిచారకులు మొదలగువారును.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

విక్రమోర్వశీయము.

[నాంది]

ఏనిన్ రోదసి నిండు నొక్కనిఁగ భావించు వేదాంత మె
వ్వానిం జెందనియీశ్వరాఖ్య యెట నన్వర్థాక్షరం బయ్యె, నే
వానిన్ రోయుదురో హృదిన్ నియమితప్రాణాదిమోక్షేచ్ఛు లా
స్థాణుం డూర్జితభక్తిగమ్యుఁ డిడుఁ గాతన్ మీకుఁ గైవల్యమున్.

[నాంద్యంతమున]

సూత్రధారుఁడు—అతివిస్తర మెందుకు? (తెరవంకఁజూచి) మారిషా! యిటు రా.

(పారిపార్శ్వకుఁడు ప్రవేశించి)

పారి—అయ్యా! యిదిగో! వచ్చినాను.

సూత్రి—మారిషా! సాధారణముగా నీసభ్యు లీవఱలోఁ బూర్వకవివిరచితము లయినప్రబంధములయభినయమును జక్కఁగ వీక్షించినవారలేగదా! నే నిప్పుడు విక్రమోర్వశీయ మనునొక యపూర్వనాటకమును బ్రయోగింపఁ దలంపుగొంటిని. కాఁబట్టి తమతమవేషములయందు జాగరూకత నుండుమని యావి పాత్రస్థులతోఁ జెప్పుము.

పారి—అయ్యా! చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

సూత్రి—నే నీసభయందలిమహాజనుల కొకవిజ్ఞాపనముఁ జేసికొనుచున్నాను.

ఆ. వె. ప్రణయిజనముమీఁదియనురాగమున నైన సద్వస్తు గౌరవమున నైన
నాలకింపరయ్య సావధానతను, వి। ద్వాంసులార! కాళిదాసకృతిని.

(తెరలో) అమరపక్షపాతంబు నాకాశగమనంబును గల యయ్యలారా! రక్షింపుఁడు రక్షింపుఁడు.

సూత్రి—(బయలాలకించి) ఏమిది! మదీయవిజ్ఞాపనానంతరము గొఁవంకలు విలపించులాగున నార్తప్రలాపంబులు వినంబడుచున్నవి. (ఆలోచించి) సరే తెలిసినది.

క. నారాయణోరుభవ సుర। వారాంగన ధనదుఁ గొలిచి వచ్చెడుదానిన్
దారి నొకయసుర చెఱఁగొనె। సౌరాంగన లఱతు రదిగొ శరణార్థినులై.

(నిష్క్రమించుచున్నాఁడు. ప్రస్తావన.)

శ్రీ

విక్రమోర్వశీయము.

ప్రథమాంకము.

(తెరవాత నప్సరసలగుంపు ప్రవేశించుచున్నది)

అప్స—అమరపక్షపాతంబు నాకాశగమనంబును గల యయ్యలారా! రక్షింపుఁడు రక్షింపుఁడు.

(తెరవాత రథమెక్కి రాజును సూతుఁడును బ్రవేశించుచున్నారు.)

రాజు—ఏడువకుఁడు. నే నిప్పుడే సూర్యు నుపాసించి వచ్చిన పురూరవుఁడను. నన్నుఁ జేరి మిమ్ముఁ గావవలసినది దేనినుండియో చెప్పుఁడు.

రంభ—దేవా! రాక్షసునిగర్వమునుండి.

రాజు—మీకు రాక్షసగర్వమున నేమికీడు మూడినది?

రంభ—మహారాజా! చిత్తగింపుము. ఇతరులతపోమహత్త్వమునకు నుత్తలపడు నింద్రునికి మెత్తనిగత్తియు, రూపగర్వితయగు శ్రీతరుణికి నిరాకరణంబును, త్రిదివంబున కాభరణంబు నగుమాయనుఁగునెచ్చెలి యూర్వశి కుబేరభవనంబునుండి వచ్చుచుండ హిరణ్యపురవాసి యగు కేశి యనుపలలాశి, చిత్రలేఖాద్వితీయ యగునమ్మత్తకాశినిని గాంచి హఠాత్తుగా నెత్తుకొని పోయెను.

రాజు—సరే. తెలిసినది. ఆముష్కుఁడి యేదిక్కుగఁ బోయినాఁడు.

మేనక—దేవా! పూర్వోత్తరముగా.

రాజు—అప్సరలారా! యిఁక మీమనోవ్యథ నుజ్జగింపుఁడు. మీచెలిమికత్తెను జెఱ విడిపించి తేరఁ బ్రయత్నించెదను.

రంభ—రాజేంద్రా! చంద్రవంశపురుషాంతరుఁడ వయిననీకిది యనురూపమే కదా!

ప్రథమాంకము.

రాజు—మీరు నాకొఱకు నెక్కడఁ బ్రతీక్షించుచుండెదరు?

అప్స—దేవా! యీ హేమకూటశిఖరమున.

రాజు—సూతుఁడా! గుఱ్ఱముల నైశానదిశ నతివేగమునఁ దోలుము.

సూతు—దేవా! చిత్తము. (అట్లు చేయుచున్నాఁడు)

రాజు—(రథవేగము నిరూపించి) మేలు! మేలు! సూతుఁడా! యీ రథవేగము చేత మనకంటె ముందు బయలుదేఱిన యసురులనయినను (వైనతేయునైనను) గలసికోవచ్చును. ఇఁక నాపొలసుదిండిని గలసికొనుట యెంతపని? ఇదిగోఁ! జూడుము.

చ. పొడియయి తేరిముందు ఘనముల్ చను ధూళిగ; నాకుసందులం
దడవు నరిభ్రమంబున నరాంతరనైషికి; యశ్వమాళిపై
నిడుపగు నట్టిచామరము నిశ్చలతం గనుఁ జిత్రగాకృతిన్;
నడుమును వ్రేలు కేతువసనంబు, కొనన్ నిలుచున్ మరుత్త్వరన్.

(రాజును సూతుఁడును రథముతో నిష్క్రమించుచున్నారు.)

సహజన్య—సఖీ! రాజర్షి వెళ్ళినాఁడు. మనము గూడ నిర్దిష్టప్రదేశంబునకుఁ బోవుదము.

మేనక—చెలియా! యట్లే చేయుదము.

(అందఱు హేమకూటశిఖరము నధిరోహించుచున్నారు)

రంభ—ఆ రాజర్షి మనహృదయశల్యము నూడఁ బెఱుకునా?

మేన—సఖీ! సంశయింపకుము.

రంభ—దానవులు దుర్జయులు గదా!

మేన—సఖీ! యిందుఁడు సయితము యుద్ధము తటస్థించినప్పుడు, మధ్యమలోకము నుండి బహుమానపురస్సరముగా నీయననే దోడుకొనిపోయి, విజయముకొఱకు సేనాముఖమున నిలుపుకొనుచున్నాఁడు.

రంభ—సర్వథా యిట నితఁడు జయశాలి యగుఁగాక. (క్షణమూరకుండి) సఖులారా! యూఱడిల్లుఁ డూఱడిల్లుఁడు. ఇదిగోఁ! చంద్రదత్తమగు నా రాజర్షి రథము హరిణకేతనమునఁ దోఁతెంచుచున్నది. ఇతఁడు కృతార్థుఁడు గాక వచ్చువాఁడు కాఁడని తలంచెదను.

(అందఱును గన్నులెత్తి చూచుచున్నారు.)

(తరువాత రథమెక్కి రాజును సూతుఁడును, భయమునఁ గన్నులు మూసికొని చిత్రలేఖ కుడిచేయి యూఁతగొన్నయుర్వశియుఁ బ్రవేశించుచున్నారు.)

చిత్ర—సఖీ! యూఱడిల్లు మూఱడిల్లుము.

రాజు—సుందరీ! యూఱడు మూఱడుము.

ఆ. వె. భీరురాల! యసురభీతి యప్పుడ పోయెఁ; ద్రిభువనావనుఁడు గదే బలారి;
తెల్లవాఱఁ దమ్మితీఁగ పద్మము లట్లు, విప్పుమింక నీదు వెడఁదకనులు.

చిత్ర—అయ్యో! యూపిరిమాత్రమున జీవించి యున్నయీకొమ్మ యిప్పటికిని జేతన పొరయ కున్నది.

రాజు—చిత్రలేఖా! మీచెలి యీమె మిక్కిలి యదలిపోయినది సుమీ. చూడు

క. ఇందుముఖి నలుఁదగుబ్బలు, సందున మందారకుసుమసర మదరుచు నీ
సుందరికిఁ జెదరి గుండెలు, క్రిందుగఁ గొట్టుకొనుచున్నకైవడి దెలుపున్.

చిత్ర—(సకరుణముగ) సఖి! యుర్వశీ! నీగుండెను గుదురు పఱచుకో. అప్సరసవు కానియట్లు లగపడుచున్నావు.

రాజు—

క. ముడితకుసుమకోమలమగు, హృదయము నిప్పటికి విడువ దిదె భయకంపం
బడరెడిచనుఁగవనడిప, య్యెదచెఱఁగున దాని తెఱఁగు నెఱుఁగఁగ వచ్చున్.

ఊర్వ—(ప్రకృతిని బొందుచున్నది)

రాజు—(హర్షముతో) చిత్రలేఖా! నీవు మహాదృష్టవంతురాలవు, చూడుము. నీప్రియసఖి ప్రకృతిని బొందుచున్నది.

చ. తొగచెలి దోఁపఁగా నిరులు మాలి వెలింగెడురాత్రికైవడిన్,
బొగవరణంబు మాసి నిసిఁ బొల్చుహవిర్భుజునర్చియట్లు, తా
నగపడుచున్న దీసురుచిరాంగి క్రమంబుగ మూర్ఛ దేఱి, లోఁ
దెగి దరి కూలఁగాఁ, గలఁగి తేఱెడుగంగ తెఱంగు దోఁపఁగన్.

చిత్ర—సఖీ! నామాట నమ్మవే. అసురవిరోధులు హతాశు లయి పరాభూతు లయినారు.

ఊర్వ—(కన్నులు దెఱచి) సఖీ! మహేంద్రప్రభావము చేతనా?

చిత్ర—కాదు. కాదు. మహేంద్రసదృశానుభావుఁ డయినయీరాజర్షి చేత.

ఊర్వ—(రాజును జూచి తనలో) ఆరాక్షసులు నాకు మహోపకారులు గదా!

రాజు—(మూర్ఛదేఱినయుర్వశిని జూచి తనలో) ఆహా! పూర్వము నారాయణముని నాసకొలుపుటకుఁ బోయి, యాయనయూరువునందుఁ బుట్టినయీసుందరిని జూచి యప్సరస లందఱు సిగ్గుఁ బొంది రనుమాట తగియే యున్నది గదా! అయిన నీమె నామునిసృజించినాఁ డనుట యుక్తము కాదు.

ఉ. చారుకళాతిసుందరుఁడు చంద్రుఁడొ, భువనైకమోహి శృం
గారరసప్రధానుఁ డగుకంతుఁడొ, సూనదుఁ డౌవసంతుఁడో,
యారయఁ గాక, వేదజడుఁడై విషయేచ్ఛల మానుప్రాని రా
బారి మనోహరం బయినపైదలిరూపు సృజింప నోపునే?

యుర్వ—ప్రియసఖీ! సఖీజన మెక్కడ నున్నదే?

చిత్ర—అభయదాన మొసంగినయీమహారాజెఱుంగును.

రాజు—(యుర్వశిని జూచి) అదిగో! నీసఖు లక్కడ నతివిషాదమును బొందుచున్నారు. చూడు.

తే. గీ. తరుణి! యాదృచ్ఛికంబుగా దారి నొక్క, పొరిగనుఁగొని నేత్రసాఫల్య మొందు
నతఁడె నీయెడఁ బాటున కడలు నరఁగఁ, జిరదృష్టస్నేహసఖురాండ్రఁ జెప్ప నేల?

ఊర్వ—(వెనుక దిరిగి) ఈయనమాట యమృతపుఁదేటగదా! అయినను జంద్రుని వలన నమృత మొలుకుట యేమి యాశ్చర్యము? (ప్రకాశముగా) అందువలననే సఖీజన దర్శనమునకు నాచిత్తము తత్తఱించుచున్నది.

రాజు—(ప్రీతితోఁ జూపుచు) సుందరీ!

క. ఘనహేమకూటగతలై, గనెదరదే నీదుచెలిమికత్తెలు నీమో
మును గనులకఱవు దీఱఁగ, జనములు రాహుప్రముక్తుఁ జంద్రునిఁబోలెన్.

ఊర్వ—(అభిలాషతో రాజును జూచుచున్నది.)

చిత్ర—సఖీ! యేమి చూచుచున్నావే?

ఊర్వ—సుఖదుఃఖసమాన మగుజనమును.

చిత్ర—(చిఱునవ్వుతో) ఓసీ! యెవ రది?

ఊర్వ—సఖీ! ప్రణయిజనము గాదా?

రంభ—(సంతోషముతో జూచి) ఇదిగోఁ! చిత్రలేఖాద్వితీయ యగుప్రియసఖి నూర్వశిని దీసికొని విశాఖాసమీపగతుం డగుచంద్రుండునుం బోలె రాజర్షి వచ్చుచున్నాఁడు.

మేన—(చూచి) మన కిప్పుడు రెండుప్రియములు చేకూఱినవి. మనప్రియసఖి మరల రాఁగలిగినది. మహారాజు చెక్కుచెదరక యున్నవాఁడు.

రంభ—చెక్కుచెదరకయున్నవాఁ డని చక్కఁగాఁ జెప్పితివి. రాక్షసులు దుర్జయులు గదా!

రాజు—సూతుఁడా! యిదే యాపర్వతశిఖరము. రథ మిచట దింపుము.

సూతు—చిత్తము. (అట్లు చేయుచున్నాఁడు.)

ఊర్వ—(రథావతరణక్షోభము నభినయించుచుఁ ద్రాసమున రాజు నానుకొనుచున్నది.)

రాజు—(తనలో) హాయి. హాయి! నాయింద్రియములకలిమి సఫల మగుచున్నదిగదా!

తే. గీ. స్యందనక్షోభమునఁజేసి యిందువదన। తనువు తను వంటి నన్నిట్లు దాఁకుకతన
మన్మథుఁడు మొలకెత్తినమాడ్కి దేహ। మట్టె జల్లని పులకిత మయ్యె నాకు.

ఊర్వ—(సిగ్గుతో) సఖీ! కొంచెము ముందఱకు జరుగు.

చిత్ర—(చిఱునవ్వుతో) నేను జరగ లేను.

రంభ—సఖులారా! రాజర్షిని సంభావింత మిటు రండి.

(అందఱు సమీపించుచున్నారు.)

రాజు—సూతుఁడా! తేరు నిలుపుము.

క. మతి నుత్కంఠిత యగునీ, యతివ సముత్కంఠ లయినయాత్మసఖులతో
డుత మరలఁ గలసికొనియెడు, ఋతుసంపద లతలఁ బొందురీతి యెసంగన్.

సూతు—చిత్తము. (అట్లు చేయుచున్నాఁడు.)

అప్స—అదృష్టవశమున మహారాజు విజయమున వర్ధిల్లుచున్నాఁడు.

రాజు—ప్రియసఖీసమాగమమున మీరును.

ఊర్వ—(చిత్రలేఖ గయిదండ యీయ రథము దిగి) సఖులారా! యిటు వచ్చి నన్ను గట్టిగఁ గౌఁగిలించుకొండి. నేను మరల నీలాగున సఖీజనమును జూతు ననుకోనయితిని.

(అందఱుఁ ద్వారగఁ గవుఁగిలించుకొనుచున్నారు.)

రంభ—(అభిలాషతో) సర్వథా మహారాజు కల్పశతం బీపృథివిఁ బరిపాలించుఁగాక.

సూతు—దేవా! తూరుపుదిక్కున మహావేగముతో రథముచప్పుడు వినఁబడుచున్నది. చూడుము.

తే. గీ. గగనముననుండి యెవ్వఁడో కాని యొకఁడు తప్తకాంచనరుచిరాంగదములవాఁడు
నగముశృంగముమీఁదికి దిగెడు నదిగొ! మెఱుపుఁదీవియు నొఱ పగు మేఘుమట్లు

(అందఱును జూచుచున్నారు.)

అప్స—ఓహోహో! చిత్రరథుఁడు!

(తరువాతఁ జిత్రరథుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

చిత్ర—(రాజున కభిముఖుఁడయి సగౌరవముగా) రాజా! మహేంద్రున కుపకారము చేయఁ జాలినపరాక్రమసమృద్ధిచే వర్ధిల్లుచున్నావు. ఆహా! యేమి నీ యదృష్టము!

రాజు—ఓహో! గంధర్వరాజా! (రథము దిగి) మిత్రమా! కుశలమా? (చేయిచేయి పట్టుకొనుచున్నారు.)

చిత్ర—వయస్యా! కేశి యనుపలలాశి యూర్వశి నెత్తుకొని పోయినాఁ డన్న సమాచారమును నారదునివలన నాకర్ణించి, నా కేశుఁడు శీఘ్రముగా నమ్మగువను విడిపించికొని రమ్మని గంధర్వసైన్యమున కానతిచ్చెను. అనంతరము దారిలో నేనుజారణులవలన

క. ఘన మగునీజయకీర్తుల, విని యిక్కడ నున్ననిన్ను వేడుకఁ గంటిన్
మనుజేశ్వర!నీ వీవని, తను దోడ్కొని యింద్రునకు దయసేయఁదగున్.

మిత్రుఁడా! నీవు మహేంద్రునకు మహోపకారము చేసినావుగదా! చూడు.

ఆ. వె. నాఁడు శక్రునకును నారాయణుండు సృజించి యిచ్చె నీపసిండిబొమ్మ;
నసురచేతినుండి యవలీల విడిపించి యిచ్చినావు సఖుఁడ వీవు నేఁడు.

రాజు—మిత్రుఁడా! యట్లు గాదు. [రులగెలిచె;

తే. గీ. ఇంద్రునిపరాక్రమము సుమ్మి యిదియుఁ జూడ, నతనిపక్షము వాఁడే గా య
సబ్బలుల మ్రోఁగుసింగంబుబొబ్బరింత,యేనుఁగులఁ బీనుఁగులను గావించుఁగాదె?

చిత్రర—చెలికాఁడా! బాగుబాగు! గర్వరాహిత్యమే పరాక్రమమున కలంకారము.

రాజు—మిత్రుఁడా! మహేంద్రునిసందర్శనమున కిది నా కవసరము కాదు. ఈ మెను నీవే ప్రభుసన్నిధానమునకుఁ గొనిపొమ్ము.

చిత్రర—మిత్రుఁడా! నీయిష్టము. అచ్చరలారా! రెండిరెండి.

(అప్సరసలు బయలుదేఱుచున్నారు.)

ఊర్వ—(జనాంతికముగ) సఖీ! చిత్రలేఖా! యుపకారి యాయినయీరాజర్షిని నే నామంత్రణము చేయఁ జాలను. నీవు సెలవడుగుము.

చిత్ర—(రాజును డాసి) మహారాజా! "దేవర యనుజ్ఞ యిచ్చిన, భవదీయకీర్తిని బ్రియసఖిని బోలె స్వర్గలోకమునకుఁ గొనిపోవ నభిలషించుచున్నా"నని యుర్వశి మనవి సేయుచున్నది.

రాజు—మంచిది. పునర్దర్శనము లభించుఁగాక.

(అందఱు గంధర్వసహిత మాకాశోత్పతన మభినయించుచున్నారు.)

ఊర్వ—(ఉత్పతనభంగ మభినయించి) అయ్యో! తీఁగకొమ్మకు నాయేకావళి దగులుకొన్నది. (వెనుకదిరిగి రాజును జూచుచు) సఖీ! చిత్రలేఖా! దీనిని వదలింపుము.

చిత్ర—(చిఱునవ్వుతో) సఖీ! గట్టిగా దగులుకొన్నదే. ఇది వదలింపఁ దరముగాదు. అయినను యత్నించెదను.

ఊర్వ—చాలు. నీపరిహాసము. వదలింపవే.

చిత్ర—(వదల్చుచున్నది.)

రాజు—(తనలో)

ఆ. వె. మొగము సగము ద్రిప్పి మగువ వక్రపు వాలుఁజూపుచేత మరలఁ జూచె నన్నుఁ
గాన నీలతాంగి పైన మించుక నిల్పి నాకు మేలు చేసినావె తీఁగ.!

సూతు—దేవా!

క. వెలుచను లవణాంబుధిలో, నలదనుజుల ముంచి యుష్మదనిలాస్త్రం బ
మ్ములపొదిని వచ్చిచొచ్చెను, గలుఁగునఁ జొరఁబాఱు పాముక్రైవడి దోఁపఁగ.

రాజు—అటులయిన రథము దగ్గఱఁ దెమ్ము. ఆరోహించెదను.

సూతు—(అట్లు చేయుచున్నాఁడు.)

రాజు—(రథ మెక్కుచున్నాఁడు.)

ఊర్వ—(తనలో) ఉపకారి యయినయీ రాజర్షిని మగలఁ జూడఁ గలుగునా? (రాజును జూచి నిట్టూర్పులు పుచ్చుచు, గంధర్వులును దోడియప్సరసలును దానును బోవుచున్నది.)

రాజు—(ఊర్వశి పోవుదిక్కున కభిముఖుం డయి) అహా! మన్మథుఁ డందని మ్రానిపండుల కట్టు సాఁచునుగదా!

క. చదలఁ జనుచు నీ వేలుపు, మదవతి నాతనువునుండి మది లాఁగుచు ను
న్నది బలిమిని, గలహంసిక, సుద దునిమి బిసంబునుండి సూత్రముఁ బోలెన్.

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాదిసాధు
వెంకక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్రహరితస
గోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత మగువిక్ర
మోర్వశీయనాటకము ప్రథమాం
కము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

విక్రమోర్వశీయము.

ద్వితీయాంకము.

[ప్రవేశించుచున్నాఁడు తరువాత విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ—అబ్బబ్బో! శ్రాద్ధభోక్తకు మాటిమాటికిఁ బరమాన్నము త్రేపువచ్చునట్లు రాజరహస్యము నాకడుపులో నిలువక వెడలి వచ్చుచున్నది. జనులతో నిండియున్న యిచ్చోట నానోరు గాపాడుకోలేను. రాజు ధర్మాసనమున నుండునంతవఱకును జనసమ్మర్దము లేని దేవచ్ఛందప్రాసాదమునఁ గూరుచుండెదను.

(నడచి చేతులతో నోరు మూసికొని కూర్చున్నాఁడు.

[తరువాతఁ జేటి ప్రవేశించుచున్నది.]

చేటి—దేవి యయినకాశిరాజపుత్త్రి నాతో "నిపుణికా! మహారాజు సూర్యభగవాను నుపాసించి వచ్చినది మొదలు మతిపోయినవానిలాగునఁ గానఁబడుచున్నాఁడు; కావున నాయనకుఁ బ్రియమిత్త్రుఁ డగువిదూషకునొద్దకుఁ బోయి రాజుగారి మనస్తాపమునకుఁ గారణము నెఱింగి రావె" యని యిప్పుడు సెల విచ్చెనుగదా! ఆబ్రహ్మబంధుని నే నేలాగున వంచింతును? అయినను తృణాగ్రమున ముత్తెములాగున నంటుకొనియున్న మంచుఁదుంపరవలె నాబ్రహ్మచారినాలుకకొన నుండు రాజరహస్యమును నేను గదలించి వెడలింప లేనా? అతఁ డెక్కడ నున్నాఁడో వెదకెదను. (నడచిచూచి) ఇదిగో! బటమునఁ జిత్రించినకోఁతిలాగున నిక్కడ దాఁగి మాటాడక కూరుచున్నాఁడు. ఈతని సమీపించెదను. (సమీపించి) అయ్యా! వందనము.

విదూ—నీకు శుభ మగుఁగాక. (తనలో) ఈచెడుదాసిని జూడఁగనే రాజరహస్యము నాహృదయము భేదించుకొని పయికి వచ్చుచున్నదే. ఏమి చేయుదును? (కొంచెము నోరుమూచి ప్రకాశముగా) ఓసి నిపుణికా! సంగీతవ్యాపారమును మాని యెక్కడకే యీలాగున బయలుదేఱినావు?

చేటి—చిత్తము. దేవిగారు మిమ్మునే చూచి రమ్మని పంపినారు.

విదూ—ఆమె యేమని యాజ్ఞాపించినది?

చేటి—"ఆర్యమాణవకునకు న్యాయం బెంతో పక్షపాతమే. అయినను విరహవేద సాగరమున దుఃఖితాత్ముఁ డగుచున్నవారి యోగక్షేమము నొకమాఱును గనుఁగొనుటయే మానినాఁడు." అని మీతోఁ బలుకుమన్నారు.

విదూ—సామిత్రుఁ డేమయిన నా మెడఁ బ్రతికూలము జరగించినాఁడా యేమి?

చేటి—అయ్యా! చిత్తము. రాజుగారే మెనిమిత్తము పరితపించుచున్నారో యామె పేరు పెట్టి దేవిగారిని బిలిచినారు.

విదూ—(తనలో) ఓహో! చెలికాఁడు దాఁచుకొనలేక తానే రహస్యమును వెల్లడించుకొన్నాఁడు. నే నేల నోరు మూసికొని యిట్లు బాధపడవలెను. (ప్రకాశముగా) ఏమి! దేవి నూర్వశి యని పిలిచినాఁడా?

చేటి—చిత్తము.

విదూ—ఆయప్సరసను జూచినది మొదలు పిచ్చియెత్తి దేవినే కాదు, ప్రియము తప్పఁడ నయినన్నుఁగూడఁ దిండిప్రిప్పటులు లేకుండ బాధించుచున్నాఁడు.

చేటి—(తనలో) నే నుపాయముచేతఁ జల్లగా రాజరహస్యదుర్గమును భేదించితిని గదా! (ప్రకాశముగా) అయ్యా! దేవిగారితో నే నేమని మనవి చేయుదును?

విదూ—నిపుణికా! నే నిటువిూఁదట నామృగతృష్ణికనుండి చెలికాని మరలించెదను ఇప్పుడు నా మెడధ్యానమునకు వచ్చెదను. ఈసంగతియే దేవికి విన్నవింపుము.

చేటి—చిత్తము. (నిష్క్రమించుచున్నది.) (తెరలో)

వైతాళికుఁడు—దేవా! జయము జయము!

శా. ఆలోకాంతనిరస్తభూజనతమోవ్యాపారముల్ గాన, దీ
వా! లోకాప్తమహాధికారముఁ ద్వదీయంబున్ సమోద్యోగతన్
గ్రాలున్; గాములఁ జేఁదు నిల్చి క్షణ మాకాశంబుమధ్యంబునన్;
బోలన్ వాసరపష్ఠభాగమున నీవుం గొంత విశ్రామమున్.

విదూ—(చెవియొగ్గి) ఇదిగో! ధర్మాసనమునుండి లేచి ప్రియవయస్యుఁ డీలాగున నే వచ్చుచున్నాఁడు. పోయి నేను వారనిపార్శ్వభాగమున నిలిచెదను. (నిష్క్రమించుచున్నాఁడు)—ప్రవేశకము—

(తరువాత విరహవేదన గలరాజు విదూషకునితోఁ బ్రవేశించుచున్నాఁడు.)

రాజు—

క. ననవిలుతునమోఘశరం, బునఁ దూఁటగునాదుహృదయమున సులభముగా
ననిమిషసుందరి చొరఁబడెఁ, గనులను ద న్నొక్కమాఱు గనుఁగొనినంతన్.

విదూ—మిత్రుఁడా! పాపము! దేవి మిక్కిలి విచారించుచున్నది సుమీ!

రాజు—ఓయీ! నీవు రహస్యమును జక్కఁగఁ గాపాడుచున్నావు గద!

విదూ—(తనలో) అయ్యయ్యో! తొత్తుకూఁతురు నిపుణిక నన్ను మోసపుచ్చెను గదా! లే కున్నఁ జెలికాఁడు న న్నిట్లేల యడుగును?

రాజు—(సంశయముతో) ఏ మోయి! యూరకున్నావు?

విదూ—మిత్రుఁడా! యిది యూర కుంట గాదు. ఉత్తర మిచ్చుటయే. అప్పటి నుండియు నానో రిట్లే కట్టిపెట్టి యుంచినాను. చూడు. నీ కయిన, వెంటనే ప్రతివచన మీయ కుంటిని గదా!

రాజు—సరిగాని విరహవేదన గలనే నేలాగునఁ బొద్దు పుత్తును?

విదూ—దాని కింత యాలోచన యేల? వంటయింటిలోనికిఁ బోవుదము.

రాజు—అక్కడ నే మున్నది?

విదూ—మిత్రుఁడా! యక్కడ నే మున్నదా? పంచభక్ష్యపరమాన్నములును దగుచితసంభారములతోఁ గూడఁ బళ్ళెరములలో వడ్డన యయి సిద్ధముగా నుండును. అవి చూచుచు నీ వేదన నపనయింతము.

రాజు—(చిఱునవ్వుతో) అవి యన్నియు నీ కిష్ట మయినవి గావున, నక్కడ నీ కుబుసుపోవును. దుర్లభప్రార్థనుఁడ నయిన నా కచ్చటఁ బొద్దు జరుగుదా?

విదూ—మిత్రుఁడా! యుర్వశి కూడ నిన్నుఁ జూచినది గదా!

రాజు—అయిన నేమి?

విదూ—అట్లయిన నామె నీకు దుర్లభురా లని నేను దలంపను.

రాజు—వయస్యా! పక్షపాతము మాని యామెసౌందర్య మసాధారణ మని తలంచుకొనుము.

విదూ—నీవే యి ట్లనుటవలన నాకును గుతూహలము వర్ధిల్లుచున్నది. కురూపులలో నే నెట్లో, సురూపురాండ్రలో నూర్వశియు నట్లు సాటి లేనిది కాఁబోలును.

రాజు—మిత్రుడా! యామె సౌందర్యము ప్రత్యేకావయవవర్ణనమున కశక్యము గావున, సంగ్రహముగాఁ జెప్పెద నాకర్ణింపుము.

విదూ—ఇదిగో! సావధానుఁడ నయి యున్నాను.

రాజు—

క. అంగన మెయి నగకు న్నగ, సింగారంబునకు వింతసింగారంబున్
దం గగునుపమానమునకు, నంగగునుపమాన మిది యథార్థము సఖుఁడా!

విదూ—అందుచేతనే నీవు వానకోయిలలాగున దివ్యరసము నభిలషించుచున్నావు. ఇప్పు డెక్కడకుఁ బోయెదవు?

రాజు—వయస్యా! విరహి యగువానికి విజనస్థలముకంటె, వే ఱొకటి శరణము లేదు. నాకుఁ బ్రమదవనమునకు దారిఁ జూపుము.

విదూ—(తనలో) అయ్యో! యేమిగతి? (ప్రకాశముగా) దేవా! యిట్టిటు. (నడచుచున్నారు.)

విదూ—మిత్రుఁడా! ప్రమదవనచోదిత మయినయాదక్షిణమారుతము నీకతిథి సత్కారార్థ మెదురు వచ్చుచున్నది.

రాజు—చెలికాఁడా! యీవాయువునకు దక్షిణవిశేషణము తగియే యున్నది సుమీ.

తే. గీ. స్నేహదాక్షిణ్యములకల్మిచేతఁ దాను। మాధవీలతఁ దడుపుచు మల్లితీఁగ
నల్లనాడించుచును మలయానిలుండు। కామికై వడిఁ గనుపట్టుఁ గాదె సఖుడ!

విదూ—మిత్రుఁడా! నీయభిలాష మిట్టిదియే కానోపు. (నడచి) ఇదే ప్రమద వనద్వారము. మిత్రుఁడా! యిందుఁ బ్రవేశింపుము.

రాజు—ముందర నీవు పద.

(ఇద్దఱును బ్రవేశించుచున్నారు.)

రాజు—(ముందు చూచి యాయాసపడుచు) ఔరా! యాప్రమదవనము నాకు నాపత్ప్రతీకార మని నిశ్చయించుకొంటిని. తుద కది వేఱువిధ మయినది.

క. గాటపుటారాటము పూఁ, దోఁటను బాయు నని నేను దొరపడి చొర, ని
చ్చోటు ప్రతికూలమగు నా, కేటివడిం బోవువాని కెదురీఁతవలెన్

విదూ—ఎందుచేత?

ఊర్వ—(సిగ్గుతో) సఖీ! దానిప్రయోగము నీకు స్ఫురించుచున్నదా?

చిత్ర—అది యంతయు నీవే యెఱుఁగుదువు.

ఊర్వ—అవును. ఎఱుగుదును గాని, భయోద్రేకమున దానియందు నా కిప్పుడు నమ్మకము కుదుర కున్నది.

(ఇద్దఱు సిద్ధమార్గమును బొందుచున్నారు.)

చిత్ర—సఖీ! చూడు మిదిగోఁ! ప్రతిష్ఠానపురమునకుఁ జూడారత్న మగుపురూరవునిదివ్యభవనము; యమునాసంగమపావనము లయినభాగీరథీజలములయందుఁ దనయందమును జూచుకొనుచున్నట్టే గనుపట్టుచున్నది.

ఊర్వ—(ఆసక్తితో) సఖీ! స్వర్గమే వలస వచ్చిన దనుము. (ఆలోచించి) చెలియా! యాయాపన్నశరణ్యుఁ డెచ్చట నుండునో?

చిత్ర—సఖీ! యిదిగో! రెండవనందనముచందమునఁ జూపట్టుచున్నయాప్రమదావనమున దిగి తెలిసికొందము.

(ఇద్దఱు దిగుచున్నారు.)

చిత్ర—(రాజును జూచి సంతోషముతో) సఖీ! చూడుచూడు. ఈయన వెన్నెలవంటిని స్నెడఁబాసి తొలుపొడుపునెలలాగునఁ గనుపట్టుచున్నాఁడు.

ఊర్వ—(చూచి) సఖీ! మునుపటికంటె నా కిప్పుడే మహారాజు ప్రియదర్శనుఁడగుచున్నాఁడు.

చిత్ర—అది యుక్తమే. సమీపింతము రమ్ము.

ఊర్వ—సఖీ! నే నిప్పుడు సమీపించుట కాదు. తిరస్కరణీవిద్యచేతఁ గనఁబడకుండ నీయనప్రక్కనుండి చెంత నున్నచెలికానితో రహస్యమున నేమి యాలోచించుచున్నాఁడో వినియెదను.

చిత్ర—సఖీ! నీయిష్టము.

(ఇద్దఱును గూర్చున్నారు.)

విదూ—ఓప్రియమిత్రుఁడా! దుర్లభురా లగునీప్రియురాలిని గలిసికొనునుపాయ మాలోచించితిని.

రాజు—(ఊర కున్నాఁడు.)

ఊర్వ—(ఈర్ష్యతో) ఈయన గోరుకొనుటచే సౌందర్యగర్వము నొందుచున్న ధన్యురా లెవతె చెప్పుమా?

చిత్రి—సఖీ! మనుష్యభావమును బొందెద వేల? దివ్యదృష్టిని దెలిసికొనుము.

ఊర్వ—సఖీ! నే నిప్పుడు పరిభావముచేతఁ దెలిసికొనఁగలను కాని, యట్లుచేయుటకు భయపడుచున్నాను.

విదూ—ఓయి మిత్రుఁడా! నీప్రియురాలిని గలసికొనునుపాయము నాలోచించితి నని చెప్పుచున్నాను.

రాజు—చెలికాఁడా! యయిన నది యెట్లో చెప్పుము.

విదూ—మిత్రుఁడా! నీవు నిద్ర పొమ్ము; కలలో నామెను గలసికొందువు. లేదా యాయుర్వశిరూపమును జిత్తరువున వ్రాసి చూచుకొనుము.

ఊర్వ—(సంతోషముతో) ఓపిఱికిహృదయమా! యూఱడిల్లు మూఱడిల్లుము.

రాజు—మిత్రుఁడా! నీవు చెప్పినయా రెండును నాకు వలనుపడనివే.

మ. కల నా ప్రేయసిఁ దెచ్చి కూర్చునిదురన్ గన్మోడ్చి నేఁ బొందఁగాఁ
గలనా? నాయెదఁ గామువాఁడిములుకుల్ గాఁడుం గదా సర్వదా!
కలికిం జిత్తరువందుఁ జూడఁ గలనా? కందోయిబాష్పాంబువుల్
వెలికిం గ్రమ్మెడు, వ్రాయఁ బూనఁగనె యాలేఖ్యం బయోమిత్రమా!

చిత్రి—సఖీ! విన్నావమ్మా?

ఊర్వ—విన్నానుగాని నాహృదయమున కింకను దనివి దీఱకున్నది.

విదూ—వయస్యా! యావిషయమున నింతే నాబుద్ధివిభవము.

రాజు—(నిట్టూర్పు పుచ్చి)

చ. మఱిఁగెడు నామనంబునతిమాత్రపువేదన యే యెఱుంగదో,
యెఱిఁగియు స్వపరిభావమున, నేలదొ తా నను, నట్టివేలుపుం
దెలుపకున్నె, యలబ్ధఫలనీరససంగమవాంఛ నామదిన్
మఱిమఱి నెంచు మన్మథుఁడు, మంచిది, తా నె సుఖించుఁగావుతన్.

చిత్రి—సఖీ! విన్నావుగదా!

ఊర్వ—అయ్యయ్యో! మహారాజు న న్నీలాగునఁ దలంచుచున్నాఁడు. నే నెదుటఁ

బడి యాయనకుఁ బ్రతివచనము నీయఁజాలను. కావున నా దివ్యమహిమచేతను నిర్మిత మయినభూర్జపత్రమున నుత్తరము వ్రాసి యీయనయెదుటఁ బడవేసెదను.

చిత్ర—నాకు నిది యనుమతమే.

ఊర్వ—(విలాసముతో భూర్జపత్రముఁ బుచ్చుకొని వ్రాసి యట్లు చేయు చున్నది.)

విదూ—(చూచి దద్దరిల్లి) అబ్బో! యేమోయి యిది? పాముకుబుసము కాఁబోలు; మనముందఱఁ బడినది. నన్నుఁ గఱచునేమో!

రాజు—(తెలిసికొని నవ్వి) చెలికాఁడా! యిది జిలుఁగుటక్షరములతో వ్రాసిన భూర్జపత్రము గాని, పాముకుబుసము గాదు.

విదూ—అట్లయిన నో మిత్రుఁడా! యొకవేళఁ బూజ్యురా లూర్వశి తా నగపడ కుండి, నీపరిదేవనము విని, తుల్యానురాగసూచకముగా నీపత్రిక వ్రాసి పడవేసినది కాదుగద!

రాజు—కోరికల కేమికొదవ? (పుచ్చుకొని చదివి సంతోషముతో) చెలికాఁడ! నీయూహము సరిగ నున్నది.

విదూ—హి. హి. హీ. మిత్రుఁడా! బ్రాహ్మణవచన మేల మఱియొకలాగగును? నీవిఁక నిమ్మళింపవచ్చును. మఱి యందేమి వ్రాసినదో నాకుఁ జెప్పవా?

ఊర్వ—బ్రాహ్మణా! మేలు మేలు! నీవు నాగరికుఁడవు.

రాజు—చెలికాఁడా! యాలకింపుము. (చదువుచున్నాఁడు.)

ఉ. "సామి! యెఱుంగ కీవు నను స్వాంతమునం దనుకొన్నలాగునన్
బ్రేమము గల్గునీయెడల నే ననురక్తనె కాకపోయినన్,
గోమలపారిజాతసుమగుంఫితశయ్యను బవ్వళించినన్
నా మెయి నిర్దహించెడును నందనమందసుగంధవాయువుల్."

ఊర్వ—ఇప్పు డేమనునో?

చిత్ర—సఖీ! వేఱుగ ననవలసిన దేమి? వాఁడిపోయినతామరతూఁడులవంటి యీయనయవయవములు తెలుపుచునే యున్నవి.

విదూ—మిత్రుఁడా! నాఁకలిగొన్నప్పుడు నాకు స్వస్తివాచనకము దొరకినట్లు నీ కదృష్టవశమున నీ సమాశ్వాసకారణము దొరకినది.

రాజు—మిత్రమా! సమాశ్వాసకారణ మనియెద వేమి? చూడుము,

ఉ. నమ్ము, సమానురాగ పిశునమ్మును, సల్లలితార్థబంధమై
కమ్మను వ్రాసియున్న ప్రియకాంతయుదంతము, నిశ్చయమ్ముగా
నిమ్మెయి నెంతు, నాదుమదిరేక్షణ మూఁడనమ్ముతో, సఖా!
యిమ్ముగ నెప్పలెత్తి, కదియించినయాచెలిమోముఁదమ్మిగన్.

ఊర్వ—ఇయ్యెడ మాయిరువురకును నెయ్యము సమవిభాగమే.

రాజు—చెలికాఁడా! నాప్రియురాలు ప్రేమచేత స్వహస్తముతో లిఖియించిన యీపత్రిక నీచేతితోఁ బట్టుకొనుము. నా వ్రేళ్ళ చెమటచే నీయక్షరములు చెడి పోఁగలవు.

విదూ—(పుచ్చుకొని) ఏమిది? మిత్రుఁడా! పూజ్యురా లుర్వశి నీకోరికలఁ బుష్పింపఁ జేసి, పండించుటకుఁ బాలుమాలుచున్నది.

ఊర్వ—సఖీ! రాజసన్నిధానమునకుఁ బోవ జంకుచున్న నాహృదయము నేను గుదుఱుపఱుచుకొనునంతలో, నీవు ముందుగా నీయనకుఁ గానిపించుకొని నాకుఁ దగిన మాట లాడుచుండుము.

చిత్ర—అలాగే. (తిరస్కరణిని బాసి రాజుం జేరి) జయము జయము మహారాజ!

రాజు—(తొందరతోడ నాదరముతోడను) కల్యాణీ! కుశలమా? (పార్శ్వమున కుఁజూచి)

గీ. అట్టు లలరింప లేనైతి వల్లసఖిని,బాసి వచ్చుటఁజేసి నన్ భామ! నీవు
మున్ను సంగమపదమునఁ గన్నయమున, గంగ నెనయక కనఁబడ్డకరణి, నిపుడు.

చిత్ర—దేవా! ముందుగా మేఘమాలయుఁ,దరువాత మెఱుపుఁదీఁగయు గనఁబడు చుండును గదా!

విదూ—(వెనుకదిరిగి) ఈమె యూర్వశి కాదా? ఆపూజ్యురాలియనుఁగుఁ జెలియా?

రాజు—ఇదిగోఁ! చిత్రము. కూరుచుండుము.

చిత్ర—దేవా! యుర్వశి తలతోడను నమస్కరించి మహారాజుగారితో మనవి సేయుచున్నది.

రాజు—ఏ మని యాజ్ఞాపించుచున్నది?

చిత్ర—"నన్ను రాక్షసబాధవలన రక్షించుటకు దేవరవారే శరణ మయినారు.

ఇప్పుడు నేను మరల దేవరదర్శనమున మారుబారికి లోనయి వెండియు దేవరనే శరణు చొచ్చితిని; కాఁబట్టి కరుణింప వలయు''నని.

రాజు—ఓశుభాననా!

ఆ. వె. మారుబారిఁ బడియె మగువ యందువు గాని, సుదతి! నాయవస్థఁ జూడవయితి;
మాకు నిర్వ్వరకు సమానమె వలవంత, తప్తలోహమునను దప్త మదుకు.

—పూర్వపాతమునకు నుత్తరార్ధము—

మదనుఁ డదుకఁ దగును మము సమప్రణయులఁ
దప్తలోహమునను దప్త మట్లు.

చిత్ర—(ఉర్వశిని జేరి) సఖీ! యిటు రమ్ము. నీకంటెను గటికితనము వహించిన మన్మథునిఁ జూచి నీప్రియునకు నేను దూతిక నయితిని.

ఉర్వ—(తిరస్కరిణిని బాపి దుఃఖముచేత వణఁకును భయమును గలది యయి) ఓసి చలచిత్తురాలా! నన్నింతటిలో వదలిపెట్టితివే?

చిత్ర—(చిఱునవ్వుతో) సఖీ! యెవరి నెవరు వదలిపెట్టునదియు నిప్పుడే తెలియ వచ్చును. ఆచారము నడుపుము.

ఉర్వ—(భయముతో రాజును సమీపించి) జయము జయము మహారాజ!

రాజు—(సంతోషముతో) సుందరీ!

ఆ. వె. వేయిగనులవాని విడిచి వే ఱొక్కని, చాయఁ బోనినీదుజయపదంబు
నన్నుఁ బొందెఁ గాన సన్నుతాంగిరో! నాకు,జయము గలుగుటకును సందియం బె?

(చేయి పట్టుకొని చెంగటఁ గూర్చుండఁ బెట్టుకొనుచున్నాఁడు.)

విదూ—ఏ మిది నీకు మర్యాదయే గా! రాజునకుఁ బ్రియమిత్రుఁడను, బ్రాహ్మణుఁడను, నాకు నమస్కారము చేయ వయితివి.

ఉర్వ—(చిఱునవ్వుతో నమస్కరించుచున్నది.)

విదూ—స్వస్తి భవత్యై. (తెరలో)

దేవదూత—చిత్రలేఖా! యుర్వశిని త్వరపెట్టు. త్వరపెట్టు.

ఆ. వె. అప్సరసములకును నాశ్రియ మైనయే, భవ్యనాటకమున భరతమౌని
యేర్పరించె మిమ్ము, నెలమి దానిఁ గనంగ, దివిజభర్త కొలువు దీర్చి యుం

(అందఱు వినుచున్నారు.)

ఊర్వశి—(విషాదముఁ బొందుచున్నది.)

చిత్ర—ప్రియసఖీ! దేవదూతవాక్యము విన్నావా? ఇంక మహారాజునొద్ద నీవు సెలవుఁ బుచ్చుకొనుము.

ఊర్వ—(నిట్టూర్పు విడిచి) సఖీ! నాకు నోరు రాకున్నది.

చిత్ర—"మహారాజా! యీజనము పరాధీనము; కాఁబట్టి యిందాజ్ఞ నతిక్రమింప కుండుటకయి దేవరవారి నభ్యనుజ్ఞ వేఁడుకొనుచున్నా"నని యుర్వశి మనవి సేయుచున్నది.

రాజు—(కష్టముతో మాట దెచ్చుకొని) నే నీమె స్వామియాజ్ఞను గాదనఁ జాలను గాని, యీజనునిమాత్రము మఱవవల దనుచున్నాను.

ఊర్వ—(వియోగదుఃఖము నిరూపించి రాజును జూచుచుఁ జెలికత్తెతో నిష్క్రమించుచున్నది.)

రాజు—(నిట్టూర్పు విడిచి) హా! యిప్పుడు నాకన్నులకు గ్రుడ్డితనము వచ్చినట్లే యున్నది.

విదూ—(పత్రికను జూపఁ దలఁచి) మిత్రుఁడా! (అర్ధోక్తిని దనలో) అయ్యయ్యో! యింక నే మున్నది? ఊర్వశిని జూచి విస్మయపడి, చేతనుండి జాఱిపోయిన భూర్జపత్రము నెఱుఁగలేకపోయితిని.

రాజు—ఓయీ! నీవేమో చెప్పఁ బోయినావు?

విదూ—మఱేమియు లేదు. నేను జెప్పఁ దలఁచినది యిది. నీ వూరక దుఃఖింప వలదు. నీయం దుర్వశికి గాఢానురాగ మున్నదిగదా! ఆమె యింక ముందును నాయను బంధముఁ ద్రెంచివేయదు.

రాజు—నాకును మనసులో నిట్లే తోఁచుచున్నది. చూడు. ఇచ్చటనుండి బయలు దేఱి వెళ్ళునప్పుడు—

ఆ. వె. దేహమునకుఁ దా నధీశ్వరి గామి స్వా, ధీన మయినహృదిని దెఱవ నాకు
నప్పగించి చనినయట్టు లే కనుపట్టెఁ, జన్నుమిట్ట లదరుశ్వాసములను.

విదూ—(తనలో) అయ్యయ్యో! మిత్రుఁడు భూర్జపత్రముమాట యెప్పుడు దలపెట్టునో యని నాగుండెలు పీచుపీచుమనుచున్నవి.

రాజు—చెలికాఁడా! మిక్కిలి విచారముగా నున్నది. నే నిప్పు డేలాగునఁ బ్రొద్దుపుత్తును? (తలఁచుకొని) ఆఁ! యేదీ మిత్రుఁడా! భూర్జపత్రము?

విదూ—(అంతటఁ జూచి విషాదముతో) అయ్యో! కనఁబడదాయెను. మిత్రుఁడా! భూర్జపత్రము దేవతాసంబంధముగలది గదా! కావున నదియు నూర్వశితోనే పోయియుండును.

రాజు—(అసూయతో) ఛీ! మూఢున కన్నిటను బరాకే. మఱి వెదకుము.

విదూ—ఓయీ! వెదకెదను. (లేచి) ఇదిగో! నిక్కడ నున్నది. అదిగో! నక్కడ నున్నది. (బహువిధముల గంతులు వేయుచున్నాఁడు.)

(తరువాత నౌశీనరియుఁ జేటియుఁ బరివారమును బ్రవేశించుచున్నారు.)

దేవి—ఓసీ! నిపుణికా! విదూషకునితోఁ గూడ మహారా జీలతాగృహముచొచ్చియుండఁగా నిజముగా నీవు చూచినావా?

చేటి—అమ్మా! తమతో నే నెప్పుడయిన నసత్యము మనవి చేసినానా?

దేవి—అట్లయిన నీ వప్పుడు చెప్పినమాట నిజమో కాదో నే నీతీఁగెలగుంపుచాటునఁ బొంచియుండి వీరియేకాంతములను వినియెదను.

చేటి—దేవీ! చిత్తము.

దేవి—(నడచి ముందుచూచి) నిపుణికా! యిది యేమిపత్రము? పాఁతపేలికల గున దక్షిణమారుతముచేత నిటు లెగిరి వచ్చుచున్నది.

చేటి—(పరిశీలించి) దేవీ! దొరలుటను బట్టి బాగుగఁ దెలియ వచ్చుచున్నది. ఇది యక్షరములు వ్రాసినభూర్జపత్రము. ఓహో! మాయందనే దగులుకొన్నది. (పుచ్చుకొని) అమ్మా! చదువుండి.

దేవి—నీవే చదివి చూడుము. అనుకూలముగా నున్న వినియెదను.

చేటి—(అట్లు చేసి) దేవీ! యిది యాప్రవాదములాగున నే కనఁబడుచున్నది. ఊర్వశి మహారాజునకు వ్రాసినయుత్తర మని భావించెదను. ఆర్యమాణవకుని ప్రమాదము వలన మనచేతిలోఁ బడినది.

దేవి—అయినచో నది వినియెదను జదువు.

చేటి—(చదువుచున్నది.)

ఉ. "సామి! యెఱుంగ కీవు నను స్వాంతమునం దనుకొన్నలాగునన్
ప్రేమము గల్గునీయెడల నే ననురక్తనె కాకపోయినన్,
గోమలపారిజాతసుమగుంఫితశయ్యను బవ్వళించినన్
నా మెయి నిర్దహించెడును నందనమందసుగంధవాయువుల్."

దేవి—ఓసీ! రా! రా! అప్సరఃకాముకుం డయినయాయన కిది కానుకగా నిచ్చి సందర్శింతము.

చేటి—దేవీ! చిత్తము. (ఇద్దఱును లతాగృహమున కరుగుచున్నారు)

విదూ—మిత్రుఁడా! యది యేమి? గాలిచేత నెగిరిపోయి ప్రమదవనసమీపమునఁ గ్రీడాపర్వతశిఖరమునఁ గనఁబడుచున్నది.

రాజు—(లేచి యంజలిపట్టి) భగవానుఁడా! వసంతప్రియ! మన్మథబంధూ! మలయమారుత!

ఉ. భూరిసువాసనల్ గలుగు; ముచ్చిలు తీవలపూదుమార మ
య్యో! రమణీస్వహస్త మది యేరక యేల హరించితయ్య? పె
ల్లారట మొందినావు మును పంజనఁ గోరుచు; నీ వెఱుంగవే?
మారునిబారిఁ గొట్టె యగుమానిసి కిట్టివ కావె యారటల్?

చేటి—దేవీ! చూడు. చూడు. ఈభూర్జపత్రమునే వెదకికొనుచున్నారు.

దేవి—అట్లయినఁ జూచెద నూరకుండుము.

విదూ—(విషాదముతో) అయ్యయ్యో! వికసించిననల్లగలువపూవువన్నె గలిగిన యీచెమిలికన్ను చూచి మోసపోయితిని.

రాజు—అయ్యో! నేను మందభాగ్యుఁడను. సర్వథా మోసపోవుచున్నాను.

దేవి—(తటాలున సమీపించి) ఆర్యపుత్రా! తొట్రుపడకుఁడు. ఇదిగో! మీ భూర్జపత్రము.

రాజు—(తత్తఱపడి తనలో) అయ్యో! యిదిగో! దేవి. (తెలతెలపోవుచుఁ బ్రకాశముగా) దేవీ! కుశలమా?

దేవి—నాథా! నా కిప్పుడు దురాగతము వచ్చినది.

రాజు—(జనాంతికముగా) చెలికాఁడా! దీని కిప్పుడు ప్రతీకార మేమి?

విదూ—(జనాంతికముగా) సొత్తుతోఁ బట్టువడిన దొంగ, మాటలతోఁ దప్పుకొన లేఁడు.

రాజు—(వెనుక దిరిగి) మూఢుఁడ! యిది పరిహాసమునకు వేళ గాదు. (ప్రకాశముగా) దేవీ! మేము వెదకుకొనునది యీపత్రముగాదు. అది వ్యావహారికపత్రము

దేవి—నాథా! మీరిట్టును మీరు గాపాడుకోవలసినదే.

విదూ—అమ్మా! యీయనకుఁ ద్వరగా భోజనము పెట్టింపుము. దానిచేతనుగా యీపైత్యము తగ్గి స్వస్థతఁ బొందఁడు.

దేవి—నిపుణికా! యీబ్రాహ్మణుఁడు మిత్రునికయి కడుఁ జక్కఁగాఁ జెప్పుచున్నాఁడు. ఆఁకటిచేతఁ జెలికాఁడు బాధపడుచున్నాఁడఁట.

విదూ—చూడు. దేవీ! యావహించినపిశాచము గూడ నన్నుముచేత వదలిపోచున్నది. ఇఁక నిది యెంత?

రాజు—మూర్ఖ! నీవు బలవంతముగా న న్నపరాధిని జేయుచున్నావు.

దేవి—నాథా! మీ కిష్టము కాకపోయినను మీయెదుట నున్నందున నాదే యీ యపరాధము. మీ దేమియపరాధము? ఇదిగోఁ! బోయెదను. నిపుణికా! యిటు... (కోపముతో బయలుదేఱుచున్నది.)

రాజు—

క. తాళుము నే నపరాధిని, జాలింపుము కోప మిఁకఁ బ్రసన్నవు గమ్మా,
యేలిక కోపించిన జన, రాలా! దాసుండు నిరపరాధుం డగునే?

(పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

దేవి—ధూర్తుఁడా! నేను లఘుహృదయురాలను. నీబతిమాలుటలకు సంతసింపను కాని యీరహస్యము దెలిసె నేని దక్షిణనాయకుఁడవగు నీ కేమి సంభవించునో యని వెఱచుచున్నాను.

చేటి—దేవీ! యిట్టిటు.

దేవి—(రాజును విడిచి పరిజనముతో నిష్క్రమించుచున్నది.)

విదూ—మిత్రుఁడా! దేవి వానకాలపునదిలాగునఁ గలఁక దేఱక యే పోవుచున్నది లెమ్ము లెమ్ము.

రాజు—(లేచి) చెలికాఁడా! యిది యిప్పుడు తగినపని కాదు.

ఆ. వె. ప్రేమ లేనిప్రియములప్రియవాక్యములతోడి, యనునయములు సతులమనసులకును
నెక్క విది నిజంబు కృత్రిమరత్నముల్, తద్విదులకు మనసు దనుపఁ గలనె?

విదూ—నీ కీమాట యనుకూలము గానే యున్నది. కన్నులు కలఁగినవానికి దీపశిఖ యెదుట నుండఁ గిట్టదు గదా!

రాజు—అట్లు గాదు. ఊర్వశియందు మనసుపడి యున్నను, దేవియందు నాకు మునుపటిగౌరవమే యున్నది. అయినను నాప్రార్థన నుల్లంఘించినది కావున, నేనును ధైర్య మవలంబించెదను.

విదూ—మిత్రుఁడా! నీమాట దేవిమాట, యటుండ నిమ్ము. ఇప్పుడు నే నాఁకటి కోర్వఁ జాల కున్నాను. నాజీవము నిలుపఁ బెట్టుము. ఇది స్నానభోజనములకు సమయముగదా!

రాజు—(పైకిఁ జూచి) ఓహో! మధ్యాహ్న మయినది. చూడు.

చ. చలువకుఁ జేరెడున్ నెమిలి చల్లనిచెట్టుమొదంటిపాదునం
దళి యదె కర్ణికారముకుళాగ్రము విచ్చుక లోనఁ దూరెడున్,
నిలువక కన్నెలే డుడుకునీటఁ, దటాకినికల్లఁ దూరెడున్:
జిలుకయుఁ బంజరాన దగచేఁ బడకింటు జలంబు గోరెడున్.

(నిష్క్రమించుచున్నారు.)

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాదిసాధు
వంశక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్రహారితస
గోత్రపవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత మగువిక్రమోర్వశీయనాటకము ద్వితీయాం
కము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

విక్రమోర్వశీయము.

తృతీయాంకము.

(తరువాత భరతశిష్యులు ప్రవేశించుచున్నారు)

ప్రథముఁడు—మిత్రుఁడా! పైలవ! మహేంద్రసభకుఁ బోయెదుమనయుపాధ్యాయులతో నీవు దర్భాసనము పట్టుకొని కూడఁ బోయితివి. నే నగ్నిహోత్రగృహమును గాపాడుటకై యింటియొద్ద నుంటిని. అందుచేత నిన్నడుగుచున్నాను. గురువుగారినాటకప్రయోగమునకు దేవసభ యానందించినదా?

ద్వితీయుఁడు—మిత్రుఁడా! గాలవ! యెట్టు లానందించినదో నాకుఁ దెలియదు. సరస్వతీకృత మైనయాలక్ష్మీస్వయంవరనాటకప్రబంధమున నూర్వశి యాయారసాంతరస్థానములయందు బొత్తిగ నున్మత్తురాలయి ప్రవర్తించినది.

ప్రథ—మిత్రుఁడా! నీ విట్లుఁ జెప్పఁ బోవుదానియందు దోషమున కవకాశ మున్నట్టు పొడకట్టుచున్నది.

ద్వితీ—అవును. అప్పుడు ప్రమాదమున నూర్వశిమాట తడఁబడినది.

ప్రథ—ఎట్లు?

ద్వితీ—మిత్రుఁడా! యానాటకములో లక్ష్మీవేషమును ధరించినయూర్వశిని జూచి వారుణీవేషమును ధరించిన మేనక "సఖీ! ముల్లోకముల నున్నలోకపాలురు విష్ణుతోఁ గూడ నీస్వయంవరమునకు వచ్చి యున్నవారు. ఇందులో నీ కెవరిమీఁద మన సున్నదో చెప్పు మన్నది.

ప్రథ—తరువాతఁ దరువాత?

ద్వితీ—అప్పు డూర్వశి పురుషోత్తమునిమీఁద ననఁ బోయి పురూరవునిమీఁద నని పలికినది.

ప్రథ—ఆహా! బుద్ధింద్రియములు కాఁబోవుదాని ననుసరించి యుండును గదా! దానికి మనగురువుగారు కోపపడలేదా?

ద్వితీ—కోపపడ కుందురా? గట్టిగ శపించినారు. పిమ్మట దేవేంద్రుఁడు దానిని గనికరించినాఁడు.

ప్రథ—మిత్రుఁడా! యది యెట్లు?

ద్వితీ—"ఓసీ! నాయుపదేశము దప్పితివి; కావున నీకు దివ్యస్థానము లేక పోవుఁగాక" యని యొజ్జలు శపించినారు. అప్పుడు సిగ్గునఁ దలవంచుకొని యున్న యుర్వశిని జూచి మహేంద్రుం డుర్వశీ! నీవు మోహించినవిధమున నాకు రణసహాయుఁ డయిన రాజర్షికిఁ బ్రియము సలుపవలసినదే. సంతానప్రాప్తి యగునంతవఱకు నప్పురూరవుని యథేచ్ఛముగాఁ బొందియుండుమని సెల విచ్చినాఁడు.

ప్రథ—మిత్రుఁడా! యుత్తములను గూడఁ దనవంటివారినిగానే తలఁచుకొనియెడు మహేంద్రుని కట్లు పలుకుట యుచితమే గదా!

ద్వితీ—(సూర్యునిఁ జూచి) మాటలపరాకున స్నానవేళ మించఁబెట్టి తప్పు చేసితిమి. ఇంక మనము గురువుగారియొద్దకుఁ బోవుదము. పద.

(నిష్క్రమించుచున్నారు)

(విష్కంభము.)

[తరువాతఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—

చ. కడఁగుదు రర్థముల్ పడయఁ గల్గవయస్సున గేస్తు లందఱున్;
గొడుకు లనంతరంబు గయికో గృహభారము, విశ్రమింతురు; మా
కడిగడి చేమి? మే నహరహంబు హరించెడిసేవరూపునన్
జెడుచెఱ మూఁడెఁ; గష్ట మిది స్త్రీజనమం దధికార మక్కటా.

—పూర్వపాఠము—

ఉ. ఎల్లరుఁ బ్రాయమం దనుభవించి సుఖంబులు, మీఁదఁ బుత్రులం
దిల్లిడి విశ్రమింతు రిఁక నేమొ శరీరము ప్రత్యహంబు శో
షిల్లఁగఁ జేయుసేవ యనుజీవ్యత నెప్పుడు నిట్లయుంటి మో
చెల్ల! మహాభరంబు గద స్త్రీజనమం దధికార మేరకెన్.

(నడచి) వ్రతస్థురాలగుదేవి నాతోఁ "కంచుకీ! నేను గోపము మాని నాథా! నావ్రతము గొనసాగింప వలసిన దని నిపుణికాముఖమున మహారాజును బ్రార్థించి యుంటిని. నీవు కూడ నిప్పుడు నామనవిగా మహారాజున కట్లు విన్నవింపు మని సెల విచ్చినది. కావున నిప్పటికి సంధ్యాజపమును నిర్వర్తించి యుండుమహారాజును నేను సందర్శించెదను. (నడచిచూచి) ఆహా! రాజగృహమునందలిసాయంకాలవృత్తాంత మెంత రమణీయముగా నున్నది!

చ. మలఁచినమావెరిన్ నిదురమంపునఁ బోల్చు నెమిళ్ళ యష్టులన్;
వలభులయందుఁ బావురపుభ్రాంతి నొనర్చెడు జాలధూపముల్;
వెలుఁగు లెసంగ నంతిపురివృద్ధసతుల్ సుమోపహార మా
స్థలముల సాంధ్యమంగళవిధానముగా విభజింతురు దీపముల్.

(చూచి) ఓహో! మహారా జీలాగుననే వచ్చుచున్నాఁడు.

ఆ. గీ. బలసి యూడిగంపునెలఁదుకల్ దివిటీలు, కేలఁబూని రాఁగఁ గ్రాలె నితఁడు,
చఱులకర్ణికారశాఖలపూలతో, నడచుపక్షసహితనగము వోలె.

ఈయనకు నేను గనఁబడులాగున నిలిచి వేచియుండెద. (నిలుచున్నాఁడు)

(తరువాతముందుచెప్పినట్లుపరివారముతో రాజునువిదూషకుఁడునుబ్రవేశించుచున్నారు)

తే. గీ. పగలు కార్యాంతరంబులఁ దగిలి యుండి, యెట్టెటో ప్రొద్దుపుచ్చితి నింక నిపుడు
నిర్వినోదత జాములు నిడుపు లగును; గటకటా! యెట్లు లీ రేయి గడపువాఁడ?

కంచు—(సమీపించి) జయము జయము మహారాజ! "నాథా! మనమణిహర్మ్య మీఁదికిఁ జంద్రుఁడు చక్కఁగాఁ గనఁబడఁ గలఁడుకావున, నాధవళకిరణుఁడు రోహిణీ సమీపమునకు వచ్చునంతదనుక దేవరవారు ప్రాకొఅకు మేడమీఁద దయచేసి యుండ వలయు" నని దేవి మనవి సేయుచున్నది.

రాజు—అయ్యా! సత్కీర్తీ! నీయిష్ట మంటి నని దేవితో మనవిచేయుము.

కంచు—దేవా! చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు)

రాజు—(విదూషకునితో) చెలికాఁడా! దేవి యీవ్రతము కేవలము పరమూగానే యారంభించి యుండునా?

విదూ—మిత్రుఁడా! యామె కిప్పుడు పశ్చాత్తాపము గలిగినది. అందు

మను పోమెను నీవు కాళ్ళు పట్టుకొని బతిమాలుకొనినను నిరాకరించి కోపముతో లేచి పోయినతప్పు నీనోము నెపమునఁ బాపుకొనఁ దలఁచిన దని నే నూహించెదను.

రాజు—నీవు బాగుగా నాలోచించి చెప్పితివి. అట్లేసుమీ.

క. మొదటఁ బ్రణామము మీఱియుఁ, బదపడి మానినులు మిగులఁ బశ్చాత్తాపం
బొడవి దయితానునయముల, నెపలను గడు సిగ్గుపడుదు రెందును సఖుఁడా.

ఏదీ? మణిహర్మ్యమునకు నాకు మార్గము చూపుము.

విదూ—మిత్రుఁడా! యిదిగో! మణిహర్మ్యము. రాత్రియగుటచేత దీపముల వెలుఁగునఁ గడు రమణీయముగాఁ గానఁబడుచున్నది. దీనిని గంగాతరంగములవలె నున్న యాస్ఫటికమణిసోపానములమీఁదుగా నారోహింపుము.

రాజు—ముందు నీ వెక్కుము.

అందఱు—(మేడ యెక్కుచున్నారు.)

విదూ—మిత్రుఁడా! చంద్రోదయమునకు వేళ యయినట్టున్నది. చీఁకటి క్రమక్రమముగాఁ బలుచనయి తూర్పుదిక్కు కొంచె మెఱుపెక్కి నేత్రోత్సవము సేయుచున్నది.

రాజు—నీవు చక్కఁగాఁ బలికితివి.

ఆ. వె. పొడుపుఁగొండవెనుకఁ బొంచి యుండినచంద్రు, కిరణములను నిరులు విరిసి పోవ
ముంగురులను నూర్ధ్వముగఁ దోచికొన్నట్లు, ప్రాఙ్ముఖంబు కనులపండు వయ్యె.

విదూ—ఇహిహీ! మిత్రుఁడా! యుండ్రముక్కలాగున భగవానుఁడు మృగలాంఛనుఁడు పయికి వచ్చుచున్నాఁడు.

రాజు—(చిఱునవ్వుతో) అన్నిటఁ దిండిపోతున కాహారమే విషయము. (లేచి యంజలి పట్టి) భగవానుఁడా! నిశానాథా!

ఆ. వె. సూర్యుఁ జేరు దీవ సుజనులక్రియలకై; సుధను దనుపు దీవ సురలఁ బితల;
నిసిని గ్రమ్ము నిరులుపస యడంతువు నీవ; హరునిశిరముమీఁదియతఁడ వీవ?
దేవా! నీకు నమస్కారము.

విదూ—మిత్రుఁడా! బ్రాహ్మణుఁడ నయిననానోమునుండి వచ్చునక్షరములచేత మీతాత గారు నీ కనుజ్ఞ నిచ్చుచున్నారు. నీ వాసన మలంకరింపుము. నేనును సుఖముగాఁ గూరుచుండెదను.

రాజు—(కూరుచుండి పరిజనమును జూచి) ఈవెన్నెలలో నీదివిటీలు వెలవెల పోవుచున్నవి. వ్యర్థముగా నివి యేల? మీరు సెలవు పుచ్చుకొని విశ్రమింపుఁడు.

పరి—దేవా! చిత్తము. (నిష్క్రమించుచున్నారు)

రాజు—(చంద్రునిఁ జూచి విదూషకునితో) చెలికాఁడా! ఇంక నొకముహూర్తమునకు దేవి వచ్చును. కనుక నీరహస్యస్థలమున నాయవస్థను నీకుఁ జెప్పెదను.

విదూ—మిత్రుఁడా! యుర్వశి కనఁబడకపోయిన నేమి? ఆమె పోవునపుడు నీయెడల గాఢానురాగము కనఁబఱిచినదిగదా! కాఁబట్టి యాశాబంధమున జీవమును గాపాడుకోవచ్చును.

రాజు—మిత్రమా! నీవుచెప్పినది సత్యమే. అయినను నావలవంత యంతకంతకు నధిక మగుచున్నది.

ఆ. వె. ఎగడుదిగుడుటాలయిఱుకున వడిఁ దొట్రు, వడినయేటినీటివఱదవోలెఁ
గలయికలకు విఘ్నములు ఘటిల్లుఁజేసి, మారుఁ డిపుడు నూఱుమడుఁగు లయ్యె.

విదూ—చెలికాఁడా! యవయవము లధికముగాఁ జిక్కిపోయి నీవు శోభిల్లుచున్నావు. కావున నీకుఁ బ్రియాసమాగమము చేరువయయినట్లు నేనూహించుచున్నాను.

రాజు—(నిమిత్తమును సూచించుచు) వయస్యా!

ఆ. వె. ఆసపుట్టుమాట లాడుదు నాముఁదో, వ్యథను నీవు పాపునట్లె, చూడు
మదరుటలను దక్షిణాంసంబు గూడను, నన్ను నూఱడించుచున్న దిపుడు.

విదూ—చెలికాఁడా! బ్రాహ్మణవచనముగదా! మఱియొకలాగున నేలజరుగును?

రాజు—(ఆసతో నున్నాఁడు)

(తరువాత నభిసారికావేషము ధరించి యాకాశయానమున నుర్వశి చిత్రలేఖతోఁ బ్రవేశించుచున్నది.)

ఊర్వ—(తన్నుఁ జూచుకొని) సఖీ! చిత్రలేఖా! స్వల్పాభరణభూషితురాలనయి నీలిచీరను గట్టుకొన్న నాయభిసారికావేషము నీమనస్సున కింపుగా నున్నదా!

చిత్ర—సఖీ! యేమి చెప్పెదను? నీయందమును వర్ణించుటకు నాకు వాగ్వైభవము చాలదు. అయిన నిట్లనుకొనెదను. నేనే పురూరవసుఁడ నయితినా—

ఊర్వ—సఖీ! నన్ను నావన్నెకాఁ డున్నచోటికి సత్వరముగఁ గొనిపొమ్మని హృదయస్థుఁ డగుమన్మథుఁడు నీ కాజ్ఞాపించుచున్నాఁడు.

చిత్రి—(చూచి) సఖీ! కైలాసశిఖరసశ్రీకంబయి యామినీయమునాప్రతిబింబిత మయినట్లు భాసిల్లెడునీప్రియతమునివాసభవన మిదిగో! సమీపించినాము.

ఊర్వ—చెలియా! యేలాగయినయెడల నాహృదయమును హరించినయామహారాజిప్పు డెక్కడ నుండునో, యేమిచేయుచుండునో నీదివ్యదృష్టిని దెలిసికొనుము.

చిత్రి—(ధ్యానము నభినయించి తనలో) కానీ. దీనితోఁ గొంచెము మేల మాడెదను. (ప్రకాశముగా) సఖీ! తెలిసికొన్నాను: ఇప్పు డామహారాజు విహారయోగ్యప్రదేశమున మనోరథలబ్ధ మయినప్రియాసమాగమసుఖము ననుభవించుచున్నాఁడు.

ఊర్వ—(విషాదము నభినయించుచు నిట్టూర్పుతో) సఖీ! యట్టియదృష్టము పట్టినది ధన్యురాలుగదా!!

చిత్రి—ఓసిముగ్ధా! యది నీవుగాక మఱియొకప్రియురా లనుకొనుచున్నావే?

ఊర్వ—(నిట్టూర్పుతో) సఖీ! యవశమయి నాహృదయ మట్లు సంశయించుచున్నది.

చిత్రి—(చూచి) సఖీ! చూడు మిదిగో! మహారాజు నర్మసఖుఁడొకఁడే తనకు సహాయుఁడుగా నీమణిసౌధమున నాసీనుఁడయి యున్నవాఁడు. సమీపింతమురమ్ము.

ఇద్దఱు—(దిగుచున్నారు)

రాజు—వయస్యా! రాత్రితోఁగూడ నామదనబాధ వర్ధిల్లుచున్నది.

ఊర్వ—సఖీ! యర్థము స్పష్టముకాక యున్నయీయనమాటచేత నాగుండెలు తటతటఁ గొట్టుకొనుచున్నవి. సంశయము దీఱువఱకు నిక్కడ దాఁగియుండి వీరిరహస్యభాషణములను విందము.

చిత్రి—సఖీ! నీయిష్టము.

విదూ—మిత్రుఁడా! నీ వమృతగర్భము లయినయీచంద్రికిరణములను సేవింపుము.

రాజు—వయస్య! యీతాప మిటువంటివానిచేత నుపశమిల్లునా;

తే. గీ. క్రొన్ననలపాన్పు, జాబిల్లివెన్నెలలును, మైఁ బలందినగందంబు, మణులభువులు,
దాప మార్చునె, యావేల్పుఁదరుణియైన—

ఊర్వ—(ఱొమ్మునఁజేయియుంచుకొని) ఇఁక రెండవదేదో?

రాజు— నా మెయేకాంతకథయైన నార్చుఁగాని.

ఊర్వ—హృదయమా ! నన్ను విడిచి యీయనను బొందినందుకు నీ విప్పుడు తగిన ఫలమును బొందితివి.

విదూ—మిత్రుఁడా ! నీవు చెప్పినమాట నిజమే. నేను గూడ గారెలుగాని బూరెలుగాని దొరకనినాఁడు వానిని దలఁచుకొనుచు నూఱడిల్లుదును.

రాజు—మిత్రుఁడా ! నీ కవి యేలాగున నయిన దొరకఁగలవు.

విదూ—నీవును నీప్రియురాలిని శీఘ్రముగాఁ బొందఁగలవు.

రాజు—వయస్య ! నామనస్సులో ని ట్లనుకొనియెదను.

చిత్ర—ఓసి యసంతుష్టురాల ! వినువిను. ఏమో చెప్పుచున్నాఁడు.

విదూ—మిత్రుఁడా ! యెట్లు ?

రాజు—చెలికాఁడా ! విను.

తే. గీ. స్యందనక్షోభమునఁజేసి యిందువదన, యంస మంసముతోడ రాపాడెఁ గానఁ
దలఁప నీభుజ మొక్కటే ధన్య మితర, మైనమే నెల్ల భూమికి నతిభరంబు.

ఊర్వ—ఇంక నే నాలస్యము సేయ నేల ? (గ్రక్కున సమీపించి) సఖీ ! నే నెదుర నిలఁబడినను న న్నెఱుఁగనియట్లు లీయన యూరకున్నాఁ డేమి ?

చిత్ర—(చిఱునవ్వుతో) ఓసీ ! యెంతతొందరే. తిరస్కరణిని బరిహరించితివా ?

(తెరలో) దేవీ ! యిట్టిటు. (అందఱును వినుచున్నారు.)

(ఊర్వశి చెలికత్తెతో విషాదముఁ బొందుచున్నది.)

విదూ—అయ్యో ! మిత్రుఁడా ! దేవి వచ్చుచున్నది. నీ వింకఁ బెదవి గదల్పకుము.

రాజు—నీవును దిన్నగా నుండుము.

ఊర్వ—సఖీ ! యిప్పు డేమిగతి ?

చిత్ర—ఓసి పిటికిదానా ! తొందరపడకు. తిరస్కరణీవిద్యను విడువలేదు. కనుక మన మింకను గనఁబడములే. ఈదేవియు నేదో వ్రతము చేయుచున్నట్లు లగపడుచున్నది. కనుక నిక్కడఁ దడవు నిలునదు.

(తరువాతఁ బూజోపకరణములు దెచ్చుపరిజనముతో దేవి ప్రవేశించుచున్నది.)

చేటి—దేవీ ! యిట్టిటు.

దేవి—(చంద్రునిఁజూచి) నిపుణికా! భగవానుఁడు చంద్రుఁడు రోహిణీసంయోగమున నెంతచక్కఁగా శోభిల్లుచున్నాఁడే.

చేటి—అమ్మా! దేవితోఁ గూడినమహారాజునకు రమణీయత యధికము గాదా?

అందఱు—(నడుచుచున్నారు.)

విదూ—మిత్రుఁడా! దేవి నాకు వాయనమే యిచ్చునో, చంద్రప్రీతి మను మిషచేత నిన్నుద్దేశించి చేసెడియీనోముమూలమునఁ గోపము విడిచిపెట్టి ప్రణిపాతలంఘనదోషమును బరిహరించుకొనునో, యేలుఁగనుగాని, యీమె నాకిన్నాల కెంతో సుముఖురాలుగా నగపడుచున్నది.

రాజు—(చిఱునవ్వుతో) చెలికాఁడా! నీకు రెండువిధములు ననుకూలములే గాని, రెండవదిమాత్రము నా కనుకూలము. చూడు మీదేవి—

ఆ. వె. మడుఁగుఁజీర గట్టి, మంగళమాత్రభూ, షలు ధరించి దూర్వ లలకఁ గూర్చి
వ్రతము పేర గర్వగర్వ ముడుగుదే, హాయున నలుక దీఱినట్లె దోఁచు.

దేవి—(సమీపించి) నాథా! జయము! జయము!

పరి—దేవా! జయము జయము!

విదూ—(దేవింగూర్చి) స్వస్తి భవత్యై.

రాజు—దేవీ! కుశలమా? (చేయిపట్టుకొని కూర్చుండఁబెట్టుచున్నాఁడు.)

ఊర్వ—సఖీ! యీమె దేవిశబ్దమునకుఁ దగియే యున్నదిసుమీ. తేజోధైర్యగాంభీర్యసరసత్వాదిగుణములయందుఁ గొంచె మైనను శచీదేవికిఁ దీసిపోక యున్నది.

చిత్ర—సఖీ! యీమాట నీనోట నెట్లు పలుకఁ గలిగితివి?

దేవి—నాథా! దేవరవారు సన్నిహితు లయి యుండఁగా, నే నొకవ్రతము చేయవలసియున్నది. కాఁబట్టి ముహూర్తమాత్రము తమరు నాప్రతిబంధమును క్షమింపవలయును.

రాజు—(చిఱునవ్వుతో) చెలికాఁడా! చూడు. ఇది నాకుఁ బ్రతిబంధమఁట!

విదూ—స్వస్తివాచకునకు నాకుఁగూడ నిట్టి ప్రతిబంధకములు తఱచుగ లభింపవలయును.

రాజు—దేవీ! యిది యేమి నోము?

దేవి—(నిపుణికను జూచుచున్నది.)

చేటి—దేవా! యిది ప్రియప్రసాదనవ్రతము.

విదూ—(వెనుకకు దిరిగి) ఏమీ! షెవిమిటికోపముదీర్చునదా యీవ్రతము? కోపమే దెప్పింపకపోయిన నీశ్రమ మక్కఱలేకపోవునే.

రాజు—(దేవినిజూచి)

కం. ఈనోమున బిసకోమల, మైనశరీరంబు మిన్న కలయించెద వో
మానిని! నీదయ గోరెడి, వానికి సేవకున కంతపలయూనె చెప్పుమా.

ఉర్వ—(సవిస్మయమందహాసముతో) సఖీ! యీయన కీమెయందు నెంత గౌరవమో చూడుము.

చిత్ర—ఈమెయాకృతి యింతగౌరవమునకుఁ దగియే యున్నదిగదా! ఓసి ముగ్ధ! వేఱొక స్త్రీయందు ననురాగము గలవారయ్యును నాగరికులు భార్యయం దధికముగా దాక్షిణ్యము గలవారై యగుచుందురు సుమీ.

దేవి—(చిఱునవ్వుతో) ప్రాణేశ్వర! దేవర యీవిధముగా మన్నించుట ప్రీతిప్రభావమునఁ గదా!

విదూ—మిత్రుఁడా! చాలు నింక నూరకుండుము. ప్రీతము మానిపి నా వాయనము చెడఁగొట్టెను.

దేవి—బాలికలారా! పూజాద్రవ్యముల నిటు దీసికొని రండు. మేడమీఁదికి వచ్చినయీచంద్రునిపాదముల నర్చించెదను.

పరి—దేవీ! చిత్తము. ఇవిగో! పూజాద్రవ్యములు.

దేవి—తెండి. (గంధకుసుమాదులచేతఁ జంద్రకిరణములఁ బూజించి) చేటీ! చంద్రునకు నివేదించినయీయుండ్రములపళ్లెరమును బూజ్యుఁడయినవిదూషకున కిమ్ము.

చేటి—దేవీ! చిత్తము. అయ్యా! విదూషక. ఇది నీకే.

విదూ—(పుచ్చుకొని) స్వస్తి భవత్యై. బహుఫల ఉపవాసో భవతు, వ్రతమ్ సుప్రీత మస్తు.

దేవి—నాథా! యిటు దయసేయుఁడు.

రాజు—ఇదిగో! వచ్చితిని దేవి!

దేవి—(రాజును బూజించి యంజలి పట్టి) ప్రాణనాథా! మీకుఁ బ్రణమిల్లుచున్నాను. దేవతాదంపతు లీరోహిణీహరిణాంకులు సాక్షులు. ఇంతటనుండి దేవరవా

ఏస్త్రీని గామింతునో, యేస్త్రీ దేవరవారిని గామించునో యామెతోడ నప్రతిబంధముగా ప్రవర్తింతును గాక.

ఊర్వ—(ఆశ్చర్యముతో) సఖీ! యీమె యీవిధముగా నెందు కన్నదో తెలియదు గాని, నాహృదయము మిక్కిలి విశ్వాసమును బొందుచున్నది.

చిత్ర—సఖీ! మహానుభావురా లయినయీపతివ్రతచేత నీ వనుజ్ఞాత వయితివి. నిరంతరాయముగా నీకుఁ బ్రియసమాగమము గాఁగలదు.

విదూ—(వెనుకదిరిగి) మిత్రుఁడా! మొండిచేతుల బెస్తవాఁడు చేఁపజారి పోయిన దని దుఃఖపడుచు, నాకుఁ బుణ్యమగుఁడు ననుకొన్నాఁడఁట. దేవి మాటలు నీలాగుననే యున్నవి. (ప్రకాశముగా) దేవీ! నీ విఁక మహారాజునెడలఁ బ్రేమ విడిచి పెట్టుకొంటివా యేమి?

దేవి—ఓయిమూఢుఁడా! నేను నాసుఖమును మానుకొని నాభర్తసౌఖ్యమును జూచుచున్నాను. ఈయనయందు నాకుఁ బ్రేమ యున్నదో లేదో దీనినిబట్టి చూచుకొనుము.

రాజు—

క. ఇచ్చుటకు నైన నొరులకుఁ, బుచ్చుకొనుటకైన నీకఁ బోలును దాసున్;
సచ్చరిత! నీవు దలఁచిన,యచ్చున నేఁ గాను జూడుమా నీయెడలన్.

దేవి—కానిండు, కా కుండుఁడు. నే నుద్దేశించుకొన్నట్టు ప్రియప్రసాదనవ్రతము కొనసాగినది. బాలికలారా! రారే పోదము.

రాజు—ప్రియురాలా! నీ విప్పుడు నను విడిచిపెట్టి వెళ్ళితివా, నాయందింకను నీ కనుగ్రహము లేనట్లే.

దేవి—నాథా! వ్రతవిఘాతము పుణ్యవిఘాతమును జేయును గదా! (పరిజనముతో నిష్క్రమించుచున్నది.)

ఊర్వ—సఖీ! యీమహారాజు భార్యయం దింత ప్రేమ గలవాఁడని తెలిసియు నాహృదయము నీయననుండి మరలించుకొనఁ జాలకున్నాను.

చిత్ర—ఓసి బేలా! స్థిర మయినయాశ గల దని యెట్లు మరలును?

రాజు—(దగ్గఱకువచ్చి) వయస్యా! దేవి చేయునను లేదుగద!

విదూ—మిత్రుఁడా! చెప్పఁదలచిన దేమో నిశ్చయముగాఁ జెప్పు; వైద్యుఁడు బాగుచేయ లేక విడిచిపెట్టిన రోగివలె నీవామెచేత విడిచిఁపెట్టఁబడితివి.

రాజు—ఊర్వశిచేతనా?

ఊర్వ—(తనలో) నే నిప్పుడు ధన్యురాల నయితిని.

రాజు—

ఉ. చాటుననుండి యందియ లొకింత ధ్వనింపక వీనులోన వేయునా,
యాటకు వెన్కవచ్చి కను లైనను జేతులతోడ మూయునా,
నీటుగ మేడమీఁద దిగి నివ్వెఱచేఁ దనకాళ్ళు దొట్రిలన్
బోటి చేపట్టి మందఁగమనముచ్చఁగ నూర్వశి నన్ను డాయునా.

చిత్ర—సఖీ! యూర్వశీ! నీ వింకఁ బూర్ణముగా నీయన కోరికను దీర్పుము.

ఉర్వ—(జడుపుతో) నేను గొంచెము పరిహాసము చేసెదను.

(వెనుకనుండి మెల్లగా వచ్చి రాజు కన్నులు మూయుచున్నది.)

చిత్ర—(చెప్ప వలదని విదూషకునకు సంజ్ఞ చేయుచున్నది.)

రాజు—(స్పర్శసుఖమును నిరూపించి) చెలికాఁడా! యీమె నారాయణోరు సంభవ యయినయూర్వశి గాదుగద!

విదూ—మిత్రుఁడా! నీ వెట్లు తెలిసికొంటివి.

రాజు—వయస్యా! యిది తెలిసికొనుట యేమి యశక్యము?

క. వలరాయనికాఁక లమల, మల మఱిఁగెడు నాదు మేను మఱియొకచేతం
బులకిత మగునే? కలువను, నెలకరములె గాక లలర్చునే రవికరముల్?

ఉర్వ—అన్నా! యాశ్చర్యము. వజ్రలేపముచేత నంటించినట్లే నాచేతులు మరలఁ దీసికొనుటకు శక్యము గాకున్నవి. (ముకుళితాక్షియయి కన్నులమీఁదిచేతులు దీసి కొంచెము సేపు జడియుచు నిలువఁబడి మెల్లమెల్లగా సమీపించి) జయము జయము మహారాజ!

రాజు—సుందరీ! కుశలమా? (ఏకాసనమునఁ గూర్చుండఁబెట్టు కొనుచున్నాఁడు)

చిత్ర—ప్రియవయస్యు లయిన దేవరవారికి భద్రమా?

రాజు—కల్యాణీ! యిప్పుడు దానిని బొందినవాఁడ నయితిని.

ఉర్వ—సఖీ! చిత్రలేఖా! యీమహారాజును దేవి నా కొసఁగుటచేతఁ జన

లాగున ముందుగా నే నిట్లు గౌఁగిలించుకొంటిని. నన్నుఁ దుందుడుకుదానినిగా నెంచు కొనకుము.

విదూ—మిత్రుఁడా! మీ క్రీడ కక్కడనే ప్రొద్దు వోవుచున్నది.

రాజు—(ఊర్వశిని జూచి) సుందరీ!

క. దేవి యొసంగిన దనియే, యీ విప్పుడు నన్నుఁ గౌఁగిలించినదో, ముం
దేవా రొప్పఁగ దొంగిలి, నావో డెలుపంగ వలయు నాహృదయంబున్.

చిత్రి—మిత్రమా! యీమె నిరుత్తరరా లయినది. ఇప్పుడు నా దొకమనవి చిత్తగింప వలయును.

రాజు—ఇదిగో! సావధానుఁడను.

చిత్రి—స్వామీ! యీవసంతఋతువు దాఁటఁగానే గ్రీష్మఋతువున నేను భగవానుఁ డయినసూర్యునకుఁ బరిచర్య సేయవలయును. కాఁబట్టి నాప్రియసఖికి మరల స్వర్గముమీఁద మనసు వాఱకుండునట్లు దేవరవారు చేయవలయును.

విదూ—పూజ్యురాలా! యీమెకు స్వర్గములో నేమున్నది? తిననా? త్రాగనా? చేఁపలాగున ఱెప్ప వొరయనికన్నులతోఁ జూచు చుండవలయును.

రాజు—కల్యాణీ!

తే. గీ. స్వర్గ మిట్టిది యనరానిసౌఖ్య మొసఁగు, దాని మఱపింప నెవ్వనికైనఁ దరమె?
యొందుపూఁబోఁడులకు దుర్లభుం డనంగఁ, దగుపురూరవుఁ డీయింటిదానుఁ డింక.

చిత్రి—దేవా! మహానుగ్రహముగదా! సఖీ! యూర్వశీ! నీకు భయము లేదు. నన్నిఁకఁ బంపుము.

ఊర్వ—(చిత్రలేఖను గౌఁగిలించుకొని సకరుణంబుగా) సఖీ! నన్ను మఱచి పోయెదవు సుమీ!

చిత్రి—(చిఱునవ్వుతో) ప్రియసఖీ! నీవు మహారాజును జేపట్టినావు. కనుక నీలాగున నిన్ను నే ననవలసినది. (రాజునకు నమస్కరించి నిష్క్రమించుచున్నది.)

విదూ—మిత్రుఁడా! నీ వదృష్టవంతుఁడవు. మనోరథసిద్ధియయి వర్ధిల్లుచున్నావు

రాజు—మిత్రుఁడా! యిప్పటినాయభ్యుదయము చూడు.

తే. గీ. నిఖిలసామంతమకుటమాణిక్యకలిత, పాదపీఠంబు, నేకాతపత్రమయిన
ప్రాజ్యరాజ్యంబు నీయింతిపాదసేవ, సేయునంతటిధన్యత్వ మీయ దయ్యె.

ఊర్వ — దేవరవారితో బదులు పలుకుటకు నాకు వాగ్విభవము చాలదు.

రాజు — (ఊర్వశిహస్తమును బట్టుకొని) ఓహో హో! నాయిష్టార్థము సిద్ధించుట వలన నిష్ఠురద్రవ్యన్నియు విరుద్ధకార్యములు గలుగుచున్నవి.

చ. మునుపటివే హిమాంశుకరముల్, మెయి కిప్పుడు సోఁకు హాయిగా;
ననవిలుకానిమ్ములుక్కులును నాఁటివె సూ, హృదయానుకూల మా;
ననయము నాకు బెట్టిదము లైనవి యన్నియు నీవు నన్ను మ
న్నన నిటు లేలుకొన్నకతనం గడుఁ దిన్నని వయ్యెఁ దొయ్యలీ.

ఊర్వ — దేవరకుఁ జిరకాలవిరహతాపము గలిగించి నేను మహాపరాధమును జేసినాను గదా!

రాజు — సుందరీ! యట్లుగాదు —

తే. గీ. ఇల నతిక్లేశమున గడియించుకొన్న, సుఖమె రసవత్తరం బైనసుఖము సుమ్ము
మండువేసంగిలో దారి నెండ వడిన, నరులకే గాదె సుఖ మిచ్చుఁ దరులనీడ.

విదూ — మిత్రుఁడా! యింతవఱకును బ్రదోషరమణీయము లయినచంద్రకిరణములు సేవించితివి. చాలును. ఇంక నిది వాసభవనము చేరవలసినయవసరము గదా!

రాజు — చెలికాఁడా! యటులయిన నీవయస్యురాలికి మార్గముఁ జూపుము.

విదూ — పూజ్యురాలా! యిట్లేటు.

రాజు — సుందరీ! యింకొక్క కోరిక యున్నది.

ఊర్వ — స్వామీ! యది యేమి?

రాజు —

తే. గీ. మున్ను నాకోర్కె యీడేఱకున్ననాళ్ళ, రాత్రియొక్కొక్కటే నూఱు రాత్రులయ్యెఁ;
నతివ! యిటుమీఁదఁగూడ నట్లయ్యెనేని, నేఁ గృతార్థుఁడ నౌదుఁగా నిన్నుఁగూడి.

అందఱు — (నిష్క్రమించుచున్నారు.)

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాదిసాధు
పంక్తిక్షీరనీరాకరరాకాసుధాకర రాచ్చనామాత్యపౌత్రహరితస
గోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజ ప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత మగువిక్ర
మోర్వశీయనాటకము తృతీయాం
కము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

విక్రమోర్వశీయము

చతుర్థాంకము.

(తెరలో సహజన్యాచిత్రలేఖలప్రవేశమును సూచించుగీతిక.)

దినకరుకరములు దగిలి కమలములు విలసిలుకొలనిదరిన్
దనసఖిఁ బాపి కలఁగుచుహంసి మెలఁగుఁ గలసి యొకసహచరిన్.

(చిత్రలేఖయు సహజన్యయు విచారముతోఁ బ్రవేశించుచున్నారు.)

చిత్ర—(రెండడుగులు నడిచి దిక్కులు చూచి)

ద్విపద. ప్రియసఖీదుఃఖంబు పీడించు చుండ। నయనంబు లశ్రుకణములతో నిండ
వలమరుచున్నది హంసీయుగలము।గళము రాల్పడఁ దటాకమున నగ్గలము.

సహజన్య—(చిత్రలేఖను జూచి) సఖీ! చిత్రలేఖా! వసివాడిన తామరపువ్వువలె వన్నెదఱిఁగి యున్న నీమోముచాయ హృదయములోనియస్వస్థతను దెలియఁజేయుచున్నది. నేనును నీతోడిపాటుగ సుఖదుఃఖముల ననుభవింప వలసినదానను గదా! కాఁబట్టి నీ విట్టు లసౌఖ్యత నుండుటకుఁ గారణ మేమో నాకుఁ జెప్పుము.

చిత్ర—సఖీ! యప్సరసలవంతులవెంబడిని నేను సూర్యభగవానునికిఁ బరిచర్య చేయు చుండి యిప్పుడు నాప్రియసఖి నెడఁ బాసి యున్న సమయములో నీవర్ష ఋతువు వచ్చినందున మిక్కిలి వెంగ పెట్టుకొంటిని.

సహ—సఖీ! నీకును నుర్వశికిని గల యన్యోన్య స్నేహము నాకుఁ దెలిసినదే. తరువాతఁ దరువాత?

చిత్ర—సఖీ! యీదినములయందు నాప్రియసఖివృత్తాంత మెట్టు లుండునో యని దివ్యదృష్టిని ధ్యానించి చూడఁగా మహోపద్రవము గోచరించినది.

సహ—(తొందరపడి) అది యెట్లు?

చిత్ర—(సకరుణముగా) సఖీ! మనయూర్వశి తనయందలియధికానురాగముచేత మంత్రులమీఁద రాజ్యభారము నుంచినయారాజర్షితోఁ గూడఁ గైలాసశిఖరోద్దేశమున గంధమాదనవనమందు విహారము సేయఁ బోయినది.

సహ—(సశ్లాఘనముగా) సఖీ! యట్టిప్రదేశములయందలిసంభోగమే సంభోగము. తరువాతఁ దరువాత.

చిత్ర—సఖీ! తరువాత నక్కడ మందాకినీతీరమున నిసుకతిన్నెలపయిఁ బిచ్చుకగూండ్లను గట్టుకొని యాడుకొనుచున్నయుదయవతి యనువిద్యాధరబాలిక నారాజర్షి క్షణమాత్రము వీక్షించినాఁ డన్నకారణమున నుర్వశికిఁ గోపము వచ్చినది.

సహ—కాఁ దగినదే. అతిశయించినస్నేహమునఁ గట్టినది గిట్టదు గదా! తరువాతఁ దరువాత?

చిత్ర—తరువాత నూర్వశి, తన్నెన్నివిధముల నారాజర్షి బతిమాలుకొన్నను వినక, నాఁటిగురుశాపమున మూఢాత్మురాలయి దేవతానియమమును మఱచిపోయి, స్త్రీజనము చొరఁ గూడనికుమారవనమున నడుగు వెట్టినది. అడుగు వెట్టినతోడనే యాయడవిలోనితీఁగలలోఁ దాను నొక తీఁగగా మాఱిపోయినది.

సహ—అన్నా! యంతటియనురాగమున కింతటియనర్థ మెంతలో సంప్రాప్తమయినది. సఖీ! దైవమున కెందును దాఁటరానిది లేదు గదా! తరువాత నారాజర్షి యెట్టియవస్థను బొంది యుండునో!

చిత్ర—సఖీ! యటుపిమ్మట నారాజర్షి పిచ్చియెత్తినవాఁ డయి యాయరణ్యములో నిదిగో! నూర్వశి, యదిగో! నూర్వశి, యని యహోరాత్రము లెక్కతీరుగాఁ దన ప్రియతమురాలిని వెదకుచుఁ దిరుగులాడుచుండెను. అది యటుండఁగా మీఁదు మిక్కిలి వియోగము లేనివారికిఁ గూడ విరహతాపము గలిగించెడునీవర్షకాలము గూడ సంభవించినది. ఇట్టికో నటువంటిరమణీయప్రదేశమున నాతని కెట్టి యనర్థము తటస్థించునో నాకుఁ దెలియకున్నది.

(తెరలో)

ద్వి. నెచ్చెలిఁ బాయుట నెయ్యంబు పేరి । వెచ్చనిబాష్పముల్ వెడల లోనూరి,
యులమరుచున్నది హంసీయుగళము । గళము రాల్పడఁ దటాకమున నగ్గలము.

సహ—సఖీ! వారికి మరల సమాగమోపాయ మే దయినఁ గలదా లేదా?

చిత్ర—సఖీ! గౌరీచరణరాగసంభవ మయినసంగమనీయమణివలనఁ దక్క వేఱొక్కట వారికిఁ బునస్సమాగమము గలుగ నేరదు. అది యాతని కెట్లు లభించును.

సహ—సఖీ! విచారింపకు. అటువంటిసులక్షణాకృతులు గలవారలు చిరకాలదుఃఖ మనుభవింపరు సుమీ. ఏదేని యనుగ్రహము నిమిత్తముగాఁ దప్పక సమాగమోపాయము లభించు నని నే నూహించెదను. (తూర్పు చూచి) ఇదిగో! భగవానుఁడగు సూర్యుఁ డుదయింప నున్నాఁడు. మన మాయన నుపాసింపఁ బోవుదము: రమ్ము.

(తెరలో)

గీతిక. కలఁత నొందినమనసుతోడఁ, జెలిమికత్తియ నెలమిఁ జూడ
మెలఁగుచున్నది హంసలలన, గలయఁ జూచినతమ్మికొలన.

ఇద్దఱు—(నిష్క్రమించుచున్నారు.)—ప్రవేశకము—

(తెరలోఁ బురూరవునిప్రవేశము సూచించు గీతిక.)

కరినాథుఁడు గహనము చొరఁబడెఁ దనకరిణిని బాసినఖేదమునన్
తరుకిసలయకుసుమవిసరముల నిజతను వలరఁగ నున్మాదమునన్.

[తరువాత నున్మత్తవేషముతో రాజు ప్రవేశించుచున్నాఁడు.]

రాజు—(క్రోధముతో నాకాశమున లక్ష్యముంచి) ఆ! దురాత్మ! రాక్షస! నిలు నిలు. నాప్రియతమురాలిని దీసికొని యెక్కడికిఁ బోయెదవురా! కటకటా! కైలాసశిఖరమునుండి గగనమున కెగసి నామీఁద బాణవర్షము గురియించుచున్నావు.

(బెడ్డ చేతఁ బట్టుకొని కొట్టుటకుఁ బరుగెత్తి దిక్కులు చూచి)

ద్వి. శోక ముల్లంబును జుఱుచుఱఁ గాల్పఁ । బైకిఁ గన్నులనుండి బాష్పముల్ పారఁ
గలవాణిఁ బాసి రెక్కలు విదుర్చుచును । గొలన రాయంచ పొక్కుచు నున్నదకట!

రాజు—(ఆలోచించి) ఓహో! నాచిత్తవిభ్రమము!

చ. తొలుకరినీలమేఘ మిది, దుష్టనిశాటుఁడు గాఁడు; దాన ను
జ్జ్వలమగునింద్రచాప మిది, సజ్యము దానవువిల్లు గాదు; కే

వలమును నగ్నధార లివి, బాణపరంపర గాదు; పైఁడిగీ
టిలఁ దలఁపించు మించిదె, హృదీశ్వరి యుర్వశి గాదు మూఢిగా.

(మూర్ఛిల్లి మరల లేచి నిట్టూర్పు పుచ్చి)

ద్వి. తొలుత రక్కసుఁ డింతి దొంగిలించుటను । దొలుకారు మెఱుపులతోడ సరిపించు
నల్లమబ్బును జూచి నాగుండె చెదరి । చెల్లఁబో! మరలను జెనఁటి దానవుఁడు
మెలఁతను జెఱపట్టి మిరిటికై యెగసి । యలవునఁ గొనిపోవు నను కొంటి బ్రమసి.

(దుఃఖముతో నాలోచించి) అట్టు లయిన నాప్రాణనాయిక దంభోర్గు వెంటఁ బోయి యుండునో గదా!

చ. తనమహింబుచే నలిగి దాఁగెనొ, తాఁ దప వేల యల్గుఁ? జెం
గున దివి కేగనో యెగసి, కోమ్మకు నాపయిఁ గూర్మి హెచ్చు; నా
మునుమున నున్నదానిఁ గొని పోవఁగ లేరు సురారు లైన; నం
గన గన రామి కిం కిటను గారణ మే మగు నొక్కొ దైవమా.

(దిక్కులు చూచి నిట్టూర్పుపుచ్చి కన్నీళ్ళతో)అన్నా!యదృష్టము దొలఁగినవారి కాపదల మీఁదనే యాపదలు వచ్చుచుండును గదా!

ఆ. వె. ఇపుడు ప్రాప్త మయినయీప్రియావిరహంబు, నేను సైఁప లేక యిట్టు లుండ,
నాతపంబు లేమిచేతఁ జల్లనినైన, వాసరములు వచ్చె వానకారు.

(మేఘమును జూచి) గీతిక. తెలిపి లేనివానసోనలను దశదిశ లలమినజలదా!
మఱవ కిపుడు నాయాజ్ఞను సంరంభమును మానవలదా?
తిరిగి తిరిగి యీయడవిలోన నా తెఱవఁ గంటి నేని
సరగ నపుడు నీవేమి చేసినను సహియింతును గాని.

(ఆలోచించి) వృథాగా నామనోవేదన నుపేక్షించుచున్నా నేల? "రాజా కాలస్యకారణ" మ్మని మునీంద్రులు పలుకుదురు గదా! నేనే కాలమునకుఁ గారణ మయిన నన్ను బాధించుచున్న యీవర్షకాలమును నేను నిరాకరింప కుండ నేల? (నవ్వి, "రాజా కాలస్య" మొదలుగాఁ గల వాక్యము మరల నని)ఇదిగో! నిరాకరించెదను.

(అంతలో) గీతిక. పరిమళంబునఁ బరవశంబయి భ్రమరనికరము పాడఁగా,
మొరతముకో యిలమూఁకతూర్యమ్ములఁ గ్రమ్ములు గూడఁగాఁ,
గరువలిని జలియించుతలిరులఁ గల్పవృక్షము సొంపుగా
విరులు జలజల రాల నాడెను విపినమున మది కింపుగా.

పోసి. నిరాకరింపను. ఈవర్షకాలచిహ్నములవలన నా కిక్కడ రాజోపచారములు జరుగుచున్నవి. (సఖ్యా, పరిమళంబున నను గీతిక మరలఁ జదివి) ఆయుపచారము లెట్లు జరుగుచున్న వనఁగా —

ఉ. బంగరుతామ్మెఁబుంగులవనంబె జకీపనినీలిచంమువా,
నంగనపుష్పగుచ్ఛములపబ్బులతే నెలిచామరాలు, వే
సంగి యడంగుటన్ రతము సల్పు శిఖండులె నంచు లీగియల్
ముంగిటఁ జెన్నధార లనుముత్తెపుఁజేరులు గైముచేరులున్.

అయ్యో! యీ మేఘోపచారములను శ్లాఘించుటవలన నేమిలాభము? ఈయడవిలో మటుమాయమయి పోయిననాప్రియురాలిని వెదకికొనియెదను. (అంతలో)

గీతిక. తరుణీరహితం బురుమఃఖితమున్, విరహాతురముం బరిమంథనమై
కరిరాజము సుమధురరాజిత మా, గిరికాననమునఁ దిరుగుచు దన్నెన్.

(రెండడుగులు నడిచి) అయ్యయ్యో! ప్రాణేశ్వరిని వెదకుచున్న నాకు నీప్రదేశమున విరహానల మధిక మగుచున్నది.

క. అరుణాంచలములు సలిలో, దరములు నయి యలరుచున్న వనపుష్పముల సుం
దరకంఠళి పలఁకించెదుఁ, దరుణీమణి కినిసి కంటఁ దడి పెట్టుటలన్.

నాప్రియురాలిమార్గమున వెళ్ళినయెడల నా కేమిగుఱుతు లగపడఁగలవు?

తే. గీ. వాన గురిసినయీ పెనుగానలోని; యిసుకనేలను సతి పాద మిడిరయే నేని,
గురునితంబన మడుగులు గూరుకొన్న, యడుగు లగపడుఁ బారాణియానవాళ్ళ.
(నడచి చూచి సంతోషముతో) ఆహాహా! యిదిగో! నాప్రియురాలిమార్గముఁ దెలిసికొనుటకుఁ జక్కని యానవాలు గనఁబడుచున్నది.

చ. చిఱుతపుమోవిలత్తుకరసంబు గరంచెడుబాష్పబిందువుల్
పాటపాటరాలు, రాచిలుకపట్టను బోల్ చెలిపచ్చపట్టుఁబ

ర్యోఁటవిడియుత్తరీయ మిది; యీసున భిన్నగతిన్ గమించువోఁ
డటుకున జాతి పడ్డదిటఁ, దన్వి యెఱుంగదు కోపతీవ్రతన్.

—పాఠాంతరము.—

తే. గీ. అధరరాగము హరియించునశ్రువారి, నంకితంబు శుకోదరశ్యామ మిది, త
దిందునదనాస్తనాంశుక మిచట జాఱెఁ, గోపమునఁ గల్కి—వేగ మేగుచతి, నిజము.

దీనిని నేను దీసికొనియెదను. (నడిచి యాలోచించికన్నీటితో) అయ్యో! యిది యామెస్తనాంశుకము గాదు- ఆర్ద్రపురుగులచేత వ్యాప్త మయి నసనసలాడుచున్న పచ్చికపట్టు. కటకటా! యీనిర్జనవనమందు నాప్రియురాలిమార్గము నే నేలాగునఁ దెలిసికొందును? (చూచి) కానీ. ఇప్పుడు మోదినపెద్దవానకుఁ గరఁగిపోయిన శైలేయము వ్యాపించినపాతిబండపయి నెక్కి—

తే. గీ. విప్పపింఛ మెదుర వీచుగాలిని నాడ, మెడను నిడుపుగాను మీఁది కెత్తి
కేకి నల్లమబ్బుఁ గేకారవంబుతోఁ, జూచుచున్న దెంతొ సుందరముగ.

దీని నడిగి నాప్రియురాలివృత్తాంతము దెలిసికొనియెదను.

గీతిక. వెనుకటిచందము మాటి, తనసుందరిఁ గనఁ గోరి
వనగజ మబ్బురపడుచును, వనమున వడివడి నడుచును.

(మరల) గీతిక. నిను వేఁడెద బర్హిణరాజమ! యీవనమునఁ గ్రుమ్మరుచుఁ
గనినయెడల నాప్రియురాలిని గృప గలిగి తెలియఁబఱుచు
అంచనడలు నెఱచందమామ నిందించుమోము గలది
యెంచుకొనుమి యీచిన్నెలవలన గ్రహింపఁదగును వెలఁది.

(మోకటిల్లి యంజలి పట్టి)

పంచ. మయూరవంశమండనాయమాన! సుందరాంగ! నా
పయోదవేణి గానఁబడ్డపక్షమందుఁ గానలోఁ
బ్రియావియోగవహ్నిచేఁ దపించున న్నయో! భవ
ద్దయామయోక్తిశీతలామృతంపువెల్లి ముంపవే.

ఏమిది? నాకుఁ బ్రత్యుత్తర మీయక నృత్యము సేయుచున్నది! దీనికి సంతోషకారణ మేమి యయి యుండును? (ఆలోచించి)

చ. అనును గ్రహించినాఁడఁ బ్రియురాలు గనంబడ కుంటఁ జేసియే
పగ దగె నంచు నిప్పు డిది బాగుగఁ దాఁ బురివిచ్చి యాడెడున్;
విగళితబంధమై రతిని విజ్జినపువ్వులతోడి యా మెకో
ప్పగపడెనేనిఁ గోరి యొకరైన నను గాంతురె దీనిపింఛమున్.

ఛీ! యితరులదుఃఖమునకు సంతసించుచున్నదీని నింక నడుగ రాదు. (నడిచి) ఇదిగో! గ్రీష్మఋతువు గడచిపోవుటచేత మదాలస యయి నేరేడుచెట్టుమీఁదఁ గూరుచున్న దాఁడుఁగోయిల; ఇది పక్షిజాతిలోఁ బండితురాలు; దీని నడిగెదను.

గీతిక. విద్యాధరకాననమున వెదకుచు దీనాననమున
మాద్యత్కరినాథుఁడు తనమది వేదనమీఱుకతనఁ
బొంగెడుబాష్పజలంబులఁ బొరల కుండ నయనంబుల
మిఱ్ఱింగికొనుచు నడుచుఁ గదా నింగిఁ గొలుచుపాదుగునఁ దా.

(మరల) గీతిక. పరభృతికా! మధురవాణి! నీ వీ వరకాననమందుఁ
దిరిగెడునాతరుణిని జూచినయెడఁ దెలుప వేఁడుకొందు.

(నృత్యము చేయుచుఁ జేరఁ బోయి మోకాళ్ళూని) ఓకలకంఠీ!

చ. విరహులపాలి కీవు వెడవిల్తునిదూతిక వండ్రు; మానసం
హరణమునం దమోఘ మగునస్త్రమవే; యటుగాన నిన్ను నో
పరభృతి! వేఁడుకొందుఁ; గలభాషిణి నాప్రియ నిందుఁ దోడితే;
మరియటు సేయవేని, నను మానినియొద్దకునైనఁ గొంచుఁ బో.

(కొంచె మెడముగనడచి యాకాశమున) పూజ్యురాలా! యేమనియెదవు? ఇంత యనురాగము గలన న్నెందుల కెడఁబాసినదా? ఆలకింపుము.

ఆ. వె. కోపకారణంబు లోపను లెపుడు నేఁ, జేసి యుండ; నైనఁ జేడె యలిగె;
మగలమీఁదఁ గలుగుమగువలయధికార, మేల నేరముల నపేక్ష సేయు?

(తొందరగా సమీపించి మోఁకాళ్ళూని, కోపకారణం బనుపద్యము మరలఁ జదివి వీక్షించి) ఏమీ! యిది ప్రస్తుతకథను మాని తనపనినే చూచుకొనుచున్నది. బాగు!

చ. అలమట వేఁడునాపరిచయంబు గణింపక దుర్మదాంధయై
లలితపుదోఁగ నేరెడుఫలంబును మోవిని బోలె నొక్కి, తా

నెలమిని గ్రోలుచున్నయది యీపికభామిని; యొండ్లదుఃఖ మా
గ్గలమును శీతలం బనుచుఁ గా వచియింతురు; సత్యమే సుమీ.

ఓసీ! యిట్లు చేయుచున్నను నాప్రియురాలియెలుఁగువంటికంఠస్వరము గలదాన వని నీమీఁద నా కేమియుఁ గోపము రాకున్నది. నీవు సుఖముండుము. (నడచి చెవి యొగ్గి) ఓహో! దక్షిణదిక్కున నాప్రియురాలు నడుచుచున్నట్టు లందెలచప్పుడు వినవచ్చుచున్నది. అక్కడకుఁ బోయెదను.

(అంతలో)

ద్వి. ఉడుగక కళహంసికణంబు లోలరుకు నేత్రములు, నడలునఁ దడఁబడుచట్టి నెన్నడలు,
నురుతాపభరమున నుడుకు నెమ్మేను, దరము పై ల్లేచినఁ దలఁకు స్థైర్యంబు
నయి కరీంద్రుఁ డరణ్యమందుఁ గ్రిమ్మరెడుఁ, బ్రియతమావిరహసంపీడితుఁ డగుచు.
(నడచిచూచి దుఃఖముతో) అయ్యో! యెంతకష్టము!

ఆ. వె. ఆకసమునఁ బన్నినట్టిమబ్బులవల్ల, నల్లనైనదిక్కులెల్లఁ జూచి
వేగ మానసమున కేగురాయంచల, రవము గాని యందెరవళి గాదు.

కానీ. మానససరస్సునందు వేడుక గలమరాళము లీకొలనుండి యెగిరిపోక మునుపే దీనిని నాప్రియురాలివృత్తాంత మడిగెదను. (సమీపించి మోఁకాళ్ళూని) ఓహంసా! జలవిహంగరాజ!

చ. రయమున నీవు మానససరస్సున కానలఁ బోదు గాని, నీ
పయనము కంచుఁ జంచువునఁ బట్టినబత్తెపుఁ దమ్మితూఁడు నేఁ
డియ్యుఁ గొన వచ్చుఁ గాని, తరుణీమణివార్తను దెల్పి కావుమీ
దయఁ, బరకార్య మెక్కుడు గదా నిజకార్యముకన్న వేత్తకున్.

(అడ్డముగాఁ జూచి) ఇది నాకభిముఖ మయి చూచుట విచారింపఁగా, మానసోత్సుకమ నయిన నేను నీప్రియురాలిని జూడలే దనుటగాఁ దోఁచుచున్నది. (అంతలో)

ద్వి. అందమా యోరి! నీ కంచలరాయ! మందయానము దాఁచి మాయము నేయ?

(నృత్యము చేయుచు)

క. ఈతమ్మికొలనిదరి నా, శాతోదరి జూడకున్న సకలంబును నీ
వేతీరున దొంగిలితివి, రా తరుణీగమనలీల, రాజమరాళా,

ద్వి. ఆననఁబోణియొయ్యారంపునడల, చే ననుమానంబు చిక్కెనీయెడల.

(సమీపించి యంజలిపట్టి)

ఆ. వె. నాచెలందినడలు నీవు దొంగిలితివి, గాన హంస! మందయాన నిమ్ము.
దొడ్డవోయినట్టి పెద్దసొత్తున నించు, కంత దొరకువోటు నంత గొనరె?
గీతిక. తెలుపనడలు నీ కెవరు నేరిపిరి తెలుపుము రాజమరాళా!
యెఱిఁగింపుము నీ వింతిఁ జూచితే నే పూర్షింతును జాల.

(నవ్వి) ఓహో! యీరాజు దొంగలను శిక్షించు నని వెఱచి యీహంస యెగిరి పోయినది. పోనీ! మఱి యొకచోటికిఁ బోయెదను. (నడచి చూచి) ఇదిగో! దన ప్రియురాలితో నక్కడ నొకజక్కవపులుఁ గగపడుచున్నది. దానియొద్దకుఁ బోయెదను.
(అంతలో)

గీతిక. మన్మరరణితమనోహరమై, మసృణసుమకిసలభాసురమై
పేర్మి గన్న కాననమునను, ద్రియఁ బాసి కరీంద్రుఁడు చనును.

(మరల) గీతిక. గోరోచనాకుంకుమారుణాకార! చక్రవాక!
సారసాక్షిఁ జూచితివా మధువాస రమున నిట రాక,

(సమీపించి మోకాళ్ళూని)

ఆ. వె. ఓ రథాంగనామ! నే రథాంగశ్రోణి, బింబఁ బాసి పరితపించు రథిని,
మొలక లెత్తుచున్న పలుమనోరథముల, తోఁప నడుగుచుంటిఁ జేడెవార్త.

ఏమీ! యీజక్కవ "కకక" యనుచున్నది. నే నెవఁడనో యెఱుంగదు కాఁబోలు; కానీ. తెలిపెదను. ఓచక్రవాకనాయకా!

ఆ. వె. మాకు భాస్కరుండు మాతామహుండు సు, ధాకరుండు మాపితామహుండు
నుర్వి యుర్వశి యనునిర్వురు స్వయముగాఁ, గోర్కెతో వరించుకొన్న పతిని.

ఏమి! యూరకున్నది. కానీ. దీనిని నిందించెదను. (మోఁకాళ్ళూని) ఓజక్కవా! తనవలెనే యెదుటివారు నని తలంచి ప్రవర్తించుట యుక్తము గదా! చూడు.

చ. సరసునఁ దామరాకొకటి చాటయినంతనె చక్రవాకమా!
దురపిలుచుంటి వీవు కడుదూరము వోయెను జంటి యంచు: నీ
కరయఁగ నంతభీతి ప్రియురాలిని బాయుట యన్న: నయ్యయో!
విరహిని నేను నాచెలిప్రవృత్తిని వేఁడఁగ నూరకుందువే?

(కూర్చుండి) సర్వథా యిది మాదురదృష్టపరిభావము. కానీ! మఱి యొకఁ నడిగెదను. (నడిచి చూచి) ఇదిగో!

క. మొనపంట మోవి నేఁ జూఁడు, కున నొక్కఁగ సీత్కరించుకొమ్మ మొగములీ
లను, లోపలఁ దుమ్మెద జూ, మ్మనుసీవిరిపమ్మి నన్ను నరికట్టు నిటన్.

కానీ. ఈతామరపూవునందు నధివసించి యున్నతుమ్మెదను ప్రార్థించెదను. లేకున్న నీవిచారమొకటి నన్ను బాధించుచుండును.

(అంతలో) ద్వి. ఎలమితోడుతఁ గామ మెద వృద్ధి గాంచ,
గొలవఁ గ్రీడించును గోదమరాయంచ.

(చేరి యంజలిపట్టి) ఆ. వె. తుమ్మెదా! తెల్పవే ముద్దుగుమ్మవార్త;
(ఆలోచించి) చూడలేదేమొ నీవు నాసుదతి మోము;
నామెనిశ్వాససౌరభ మబ్బెనేని
నీకు మన సౌనె యీపుండరీకమందు?

(నడిచి మాచి) ఇదిగో! నీకడిమిమ్రానిబోదెపయి హస్తముంచి తనకరేణువుతోఁ గరినాథుఁడు నిలిచియున్నాఁడు. ఇతనియొద్దకుఁ బోయెదను.

గీతిక. కరణీవిరహానలబాధితమై, కానఁ దిరుగు మదకరి యుద్ధతమై.
(మరలఁ జూచి) అయిన నిప్పుడీతని నడుగఁ బోవుటకు సమయము గాదు.
ఇదిగో!

ఆ. వె. కల్లువాసన గలఫాలు గాఁచుచుండఁ, జేతఁ దెమలించి యందుగుఁజిగురుఁగొమ్మ
సరసముగ బోటి యందీయఁ గరివిభుండు, మించువేడుకతో నారగించు చుండె.

(క్షణ ముండి) ఇదిగో! నీతనిభోజన మయినది. ఇంక సమీపమునకుఁ బోయి యడిగెదను. (అంతలో)

గీతిక. కుంజరేంద్ర! నిన్నడుగు చుంటి నాకొమ్మవార్తఁ దెలుపు
మంజువాణి, మోహనాంగి చందురుమామ గెలుచుమోము గలది సుందరి. కుంజ
(సమీపించి)

ఆ. వె. ఓయియూథనాథ! యూధికాశబలకై, శ్యంబుదాని, నీకరంబుఁ బోలు
నట్టితొడలదాని, యౌవనవతిని నాసుదతి నెచటనేనిఁ జూచితయ్య?

(సంతోషముతో నాలకించి) ఓహోహో! నాకు బ్రియాలాభసూచకమగు నీఘీంకారముచేత నూఱడిల్లుచున్నాను. మఱియు సమానధర్మములనుబట్టి నీయందునా కెంతో ప్రీతి గలుగుచున్నది.

ఉ. ఏనిలc గుంభినీపతుల కీశుcడ, నీవును నట్టివాcడవే;
మానితదానసంపద సమానమె యిర్వురియందు; నాకు స
న్మానినులందు నుర్వశియు మందల నీవశ నీకుc బ్రియాసులో;
వీనికిc బోదు నావిరహవేదన నీకు లభింప కుండుతన్.

పాఠాంతరము.

మ. నను ధాత్రీశ్వరనాథుc డందురు, కరీణ్ణాథుండవ వీ వృత్కటం
బు నవిచ్ఛిన్నము నీకు దాన మది యొప్పున్ నాకు దీనాళి; మం
దను నీ కివశ, నాకు నుర్వశి వర స్త్రీరత్నంబునం, జాయ లీ
వెన వ త్తన్విట నైన గాసిలకుమీ యీప్రాప్తియోగవ్యథన్.

ఒయికరిరాజా! నీవు సుఖముండుము. నేను బోయెదను. (నడచి చూచి) ఓహో! యిది వసుంధర మయినసురభికందర మనుపర్వతము. అప్సరసలకు రమణీయవస్తువులయందు బహుప్రేమ గదా! ఒకవేళ నాప్రియురాలు దీనియుపత్యకయందుc గానcబడునేమో! (నడచిచూచి) అయ్యో! గాఢాంధకారబంధురమే! కానీ. మెఱపువెలుతురునcజూచెదను. అన్నన్నా! నాపాపము పండి మేఘము గూడ మెఱుcగు లేని దగుచున్నది. ఎట్టులయినను దీని నడుగక మరలను. (అంతలో)

గీతిక. ఖరఖురిదారితధారణీధ్రియై నిజ, కార్యపరై కవిచారణమై
తిరుగు వరాహము దీనంబై భీ, కరగహనంబున లీనంబై

తే. గీ. ఇంచుకైన నడుమ నెటె మన్నదే లేని, కుచయుగంబు గలcగురునితంబ
పంచశరుని కనికిపట్టైన నీవనాం, తరము చొచ్చెనయ్య నాకు లేందొ?

ఏమిది! యూరకున్నాcడు. దూర మగుట వినcబడ లేదేమో! చేరువకుc బోయి మరల నడిగెదను. (అంతలో)

గీతిక. స్ఫటికశిలాతలనిర్మలనిర్ఘర! బహువినసురభిళసుమకృతశేఖర!
పటుతరకిన్నరగీతమనోహర! భామామణిc జూపుము ధరణీధర.

(సమీపించి యంజలిపట్టి)

ఆ. వె. సర్వభూధరేశ! సర్వాంగసుందరి, రమ్యమైనయీయరణ్యమందుఁ
గానఁబడినదయ్య కలికి నా కెడఁబాసి, యేకతంబ సంచరించుచుండి?

(అదే ప్రతిధ్వని విని సంతోషముతో) ఏమిది! "కానఁబడినదయ్య" యని స్పష్టముగాఁ జూచినట్టు చెప్పుచున్నాఁడు. కాని, ఇంకొకసారి యడిగెదను. అయ్యా! యేమయిన దామె? (మరల నామాటనే విని) ఏమిది! మరల నే నన్నట్టే వినఁబడుచున్నది. (దిక్కులు చూచి దుఃఖముతో) అయ్యయ్యో! యివి నామాటలే. గుహాముఖమున మాఱు సెలఁగుచున్నవి. (మూర్ఛిల్లి లేచి కూర్చుండి విషాదముతో) అబ్బబ్బా! నాప్రాణము బహుదుఃఖపడుచున్నది! కొంచెము నే నీకొండవాఁగుదరిని గూర్చుండి తరంగములమీఁద నుండి వచ్చుచల్లగాలి ననుభవించెదను. (ఎదురు చూచి) ఓహో! క్రొత్తనీటివలనఁ గలక నొంది పాఱుచున్నయీయేఱు చూచుటచేత నాకానందము గలుగుచున్నది, ఏమనఁగా—

చ. అలలివి భ్రూవిలాసము లహోరె! కలంగుపులుంగుఁజాలు గం
టలమొలనూలు, పైనెరసినం దరిఁ జేర్చెడునుర్వ జాఱఁగా
లలి సనరించుచేల, కుటిలంపునడల్ మఱి తోటుఁబల్కులుం
గల పటుగానఁ గోపమునఁ గామిని యీఘని యయ్యె తూఢిగా.

కాని. దీనిని బతిమాలుకొని ప్రసన్నురాలిని జేసెదను.

గీతిక. అలుక యేటికే సుందరీ! ఝరీ! కలఁకఁ దేఱ రాదే?
కలికిమిన్న! నే నలికి నీపద కంజములకు మ్రొక్కెదఁగదే ||అలు||
చలితదీనవిహంగమకులా! లలితఝుంకృతి భృంగసంకులా!
కలితజాహ్నవీతీరతత్పర కమనీయకురంగభాసురా ||అలు||

(మరల)

గీతిక. జలధివిభుఁడు సలలితముగ నృత్యము సలుపఁ దొడఁగె నిగులఁ
దొలుకరిజలధరములు మద్దెలములు తోయపూర్ణనదు హస్తతాళములా
తూర్పుగాలి కెగసెడునల లనుచేతులను జాఁచి, మురువు
గూర్పఁ జక్రినక్రాంగశంఖసంతమమకృతాభరణంబు గైదయచ్చెనవు ||జల||

(మోఁకాళ్లూని యంజలిపట్టి)

ఉ. మానిని! నీయెడన్ మిగుల మక్కువ గల్గినవాని, నించుకం
తైనను నప్రియం బెపుడు నాడనివానిని, నీదుచెల్మికిన్
బోని ఘటిల్లు నన్నెలఁ బైన సహింపక కుందువాని, నే
డే నపరాధలేశ మెద నెంచుక దాసుని నన్నుఁ బాసితే?

ఏమిది! యూరకున్నది! అయిన నిది యుర్వశి గాదు; నిజముగా నదియే. ఊర్వశియే యాయినయెడలఁ బురూరవసుని నన్నిట్లు లడవిపాలు చేసి తాను స్వేచ్ఛను ఘనుదాభిసారిణి యగునా? కాని. ధైర్యముచేతనే మేలు చేకూరును. ఇంక నిక్కడ లేచి నాప్రియురాలు మాయ మయినచోటికే పోయెదను. (నడచిచూచి) ఇదిగో! నీ కూరుచున్న సారంగమును గూడ నాప్రియురాలి వృత్తాంతము నడిగెదను.

గీతిక. మదకలకోకిలకూజితమధుకర మంజులఝుంకారాతిమనోహర
త్రిదశాధిపనందనవనమందునఁ దేనె చిందుపూగుత్తులపొందునఁ
బొదలునొకానొకభూజముపొంతను బొలఁతిమిన్న నెడఁబాసినచింతను—
మనిఁ బొగులుచు నైరావత మనియెడు మదమాతంగం బిదె కుమ్మరియెడు॥ మదక॥

(నృత్యము చేసి మోఁకాళ్లూని)

తే. గీ. వానకాఱుఁ జూపి వాంఛించువనలక్ష్మి, భృత్యతరకటాక్షపాత మనఁగ,
నీలచిత్రవర్ణనీయకాయంబున, రంగు మీఱు నీకురంగ మార!

ఏమిది! నన్ననమానించుదానివలె నీయిఱ్ఱి మొగ మటు ద్రిప్పుకొన్నది! ఓహో యటుగాదు.

ఆ. వె. తన్నుఁ జేర రాఁగ దారిఁ బొల్లుసుదుచు, వెంటఁ బడినచిన్నిచంటి నిసువుఁ
బులిమి పున్ప లేక నిలుచున్నమృగివంక, మోడను బెడ మరల్చి మృగము చూచు.

ద్వి. కటిభారవశమందగమనంబు దానిఁ, బటు నైనయిఱిగుబ్బపాలిండ్లదాని
పలపించునిండుజవ్వన మున్నదానిఁ, బలుచనితనువల్లి భాసిల్లుదానిఁ
గలహంసలకు నడకలు దిద్దుదాని, సులలితం బగులేడిమాపులదాని
నీ కాననాటవిలో నేగమదాని, లోకసుందరిని నాలోకించితేని
సారంగమా! యానవేల్పుటింపఁ జూపింపు, విరహాబ్ధినుండి నన్వేస నుద్ధరింపు.

(సమీపించి యంజలిపట్టి) ఓయీ హరిణయూథనాథ!

ఆ. వె. చూచినావటయ్య సుదతిని గానలో, నాలకింపు మానవాలు సతికిఁ;
బెద్దకనులతోడఁ బ్రేమ నీప్రియురాలు, చూచునట్లె చూచు సుందరియును.

ఏమిది! నామాట వినిపించుకోక తనవనితనే చూచుచున్నది. అవురా! యవస్థ తప్పినవస్థా ధవమానమే తటస్థించును గదా! కాని. మఱియొకచోటికిఁ బోయెదను. (నడచిచూచి) ఇదిగో! నామెమార్గమున కానవాలు.

ఉ. ఆసుమగాత్రి నేను గనినప్పటిరక్తకదంబకం బిదే;
వేసఁగిపోక దెల్పునరవిచ్చినకేసరపాళి నెచ్చుత
గ్గాసమయంబు నందె ప్రియురాలు పదాంగుళి నిల్చి దీనిపు
వ్వాసను గోసి యొక్కటి శిఖాభరణంబునుగా ధరించెఁగా.

ఓహో! యీఱాలయిఱుకునఁ గట్టెట్టినయి కానఁబడుచున్నది, ఇది యేమి యయి యుండును?

ఉ. సింగము గోళ్ల నేనుఁగును జెండినమాంసపుముక్క గాదుగా?
యింగలపుంగణంబొ! యిది యెట్లు వనంబున నాన మోదనే!
మంగళరక్తమంజుళసమస్తబకారుణరత్న మిద్ది; దీ
నిం గొనుభంగిఁ జేతులను నీరజమిత్రుఁడు సాఁచు దీనిపై.

ఓహో! యిది నామనస్సును హరించుచున్నది. దీనిని బుచ్చుకొనియెదను. (అంతలో)

గీతిక. ప్రణయినీబద్ధాశార్ద్రిత మై బాష్పకులలోచనయుతమై
వనమునఁ జను మదకరి వగల నదనము వసివాడఁగ మిగులఁ
(పుచ్చుకొని తనలో) దీన నేమిలాభము?

క. మందారకుసుమవాసన, నంపం జగుమగునసిగకు నర్హం బిది; యా
య్యిందుముఖి యిపుడు దుర్లభ; యెందుకుఁ గన్నీళ్ల దీని నేఁ దడుపవలెన్?
(వదలిపెట్టుచున్నాఁడు.) (తెరలో) వత్సా! పుచ్చుకోపుచ్చుకో.

క. విను మిది సంగమనీయం, బనురతనము, పార్వతీపదాంబుజరాగం
బున సంభవించినది; యిది, గొని తాల్చినఁ బాయువారిఁ గూర్చును సరగన్.

రాజు—(పైకిఁజూచి) ఇట్లు నన్నాజ్ఞాపించువా రెవరో! (దిక్కులుచూచి)

ఓహో! పార్వతీపతి నన్ననుగ్రహించుచున్నాఁడు. దేవా! మహాప్రసాదము (మణిని పుచ్చుకొని) ఓహో! సంగమనీయమా!

క. వనమున నెడఁ బాసిన నా, తనుమధ్యను నన్నుఁ గూర్చు దానవ యేనిన్
నిను నేను మౌళిఁ దాల్చెదఁ, దనతల లేనెలను శివుఁడు దాల్చినలీలన్.

(నడచి చూచి) ఓహో! యేమిది! పువ్వులు లేకున్నను నీమల్లెతీఁగను జూచుట వలన నాకు మహానురాగము పొడముచున్నది. అయిన నిది నాకు మనోహర మగుట యుక్తమే. ఏమనఁగా నీలేఁదీఁగ—

ఉ. వానను నానుటేఁజిగురు బాష్పజలంబునఁ దోఁగుమోవిగా,
స్వానుగుణర్తుహీనత లతాంతము లన్ననగల్ దొలంగి, యిం
పౌనళిపాట లేమి వగ నయ్యెడు మౌనముఁ దెల్ప, నంఘ్రి లేఁ
బూనినఁ దొర్చి వెన్క— నెతఁ బొందెడు కోపనవోలెఁ దోఁచెడున్.

నాప్రియురాలిని బోలుచున్నయీతీఁగను నే నాలింగనపూర్వకముగా గౌరవించెదను.

ద్వి. ఓలతకూన! న న్నొకమాఱు గనుము, వీరిలినగుండెతో వెత నొందు చుంటి;
విధియోగమున నేను విరిఁబోణిఁ గనిన, నధికంబుగా నింక నడవిలోఁ దిరుగ;
నది గాక నాకుఁ బ్రాణాంతకి యైన, నుదతి నెప్పుడు నేను జుమ్మి యిచ్చటికి.

(సమీపించి లతను గౌఁగిలించుకొనుచున్నాఁడు. తరువాతఁ దదీయస్థాన మాక్రమించి యుర్వశి ప్రవేశించుచున్నది.)

రాజు—(కన్నులు మూసికొని స్పర్శసుఖము నిరూపించి) ఆహాహా! యుర్వశి శరీరము సోఁకినట్లే నాశరీరము హాయి నొందుచున్నది. అయిన నామెయే యనునమ్మకము మాత్రము నాకు లేదు.

సుగంధి. మించుబోణి యంచు నాస మీఱ ముందు నే సమ
గ్రించుతీఁగ మాఱి పోయె నింతలోనె కాన నా
చంచలాక్షియే యటంచు స్పర్శవృష్టి నిప్డు భా
వించు నేను వేగిరించి విప్పరాదు కన్నులన్.

(క్షణ ముండి మెల్లమెల్లగాఁ గన్నులు దెఱచి) ఏమిది! నిజముగాఁ బ్రియురాలే. (మూర్ఛిల్లుచున్నాఁడు.)

రాజు—(తెలివినిబొంది) ప్రియురాలా! యిప్పుడుగదా బ్రతికితిని.

ఆ. వె. కోపశీలురాల! కోమలి! త్వద్విర, హాంధకారమందు నడఁగు నేను
బుణ్యమునను మరలఁ బొందఁగాంచితి నిన్నుఁ, జేతనను మృతుండు చెందునట్లు.

ఊర్వ—దేవా! నన్ను నావేళఁ బాపపుఁగోప మావేశించి యట్లు గొనిపోవుటచేత దేవరవారి కింత యాయాసము సంభవించినది. స్వామీ! క్షమియింపుఁడు.

రాజు—ప్రియురాలా! నీవు నాకిప్పుడలుక దీర్ప నక్కఱలేదు. నిన్నుఁ జూచినంతమాత్రముచేతనే బాహ్యేంద్రియములతోఁగూడ నాయంతరాత్మ ప్రసన్నమయినది. నన్నెడఁబాసి యింతకాలము నీ వెట్లు లుండఁ గలిగితివో చెప్పుము.

గీతిక. మయూరపికమధురాళిరథాంగముల్, మధుకరకరిగిరిసరిత్కురంగముల్
ప్రియురాల! నీమూలమున వేఁడఁబడెఁజాల, భీకరాటవినుమ్మలికఁ గ్రుమ్మరెడు వేళ.

ఊర్వ—దేవా! నే నవశేంద్రియురాల నయి యేమియుఁ జేయలేకపోయితిని గాని, దేవరవారివృత్తాంత మంతయు నాయంతఃకరణమునకుఁ బ్రత్యక్ష మగుచునే యుండెను.

రాజు—సుందరీ! "యవశేంద్రియురాలనయి" యను నీమాటభావ మేమో నాకుఁ దెలియకున్నది.

ఊర్వ—దేవా! చిత్తగింపుము. పూర్వము మహానుభావుఁడు కుమారస్వామి శాశ్వత మయినకుమారవ్రతము నవలంబించి గంధమాదనవనమునందలియకలుష మనుకచ్ఛమునందుఁ బ్రవేశించి యుండి యచ్చోట నొక నియమము చేసెను.

రాజు—సుందరీ! యేమని?

ఊర్వ—ఆవనమున నేవనిత ప్రవేశించునో యది తీవియగా మాఱిపోవు ననియు, గౌరీచరణరాగసంభవ మయినసంగమనీయమణివలనఁ దక్క వేఱొక్కటి విమోచనము గలుగ దనియు. ఆదేవతానియమమువలన, నేను గురుశాపవశమున మూఢాత్మురాల నయి మఱచిపోయి, వనితాజనపరిహరణీయ మయినకుమారవనము ప్రవేశించితిని. ప్రవేశించినతోడనే నారూప మీకాననోపాంతమున లతాకారమునఁ బరిణమించినది.

రాజు—ప్రియురాలా! యిది యంతయు సత్యమే.

తే. గీ. అలరువిలుకానిపనుల నే నలసి సొలసి, ప్రక్కనిదురించు చుండఁ, బ్రవాసగతుని
గాఁ దలంచెదు దాన నోకలికిమిన్న! యీచిరవియోగ మెట్లు సహించినావొ.

సుందరీ! యిదిగో! నీవు చెప్పినట్లే భవదీయపునస్సంగమకారణ మయినదీనిని నే నీశ్వరానుగ్రహమునఁ బొందితిని, (మణి చూపుచున్నాఁడు.)

ఊర్వ—ఏమీ! యాశ్చర్యము! ఇది సంగమనీయరత్నమా! అందుచేతనే గదా యీమహారాజు కౌఁగిలించుకొన్నంతమాత్రముచేత లతాభావమును విడిచి ప్రకృతిరూపమును బొందినాను. (నుదురు సోఁక మణికి మ్రొక్కుచున్నది.)

రాజు—సుందరీ! నీవు క్షణమాత్ర మాలాగుననే యుండుము,

ఆ. వె. ముదిత! నీవు మణికి నుదురు సోఁకఁగ మ్రొక్క, నందుచేత దీనియరుణకాంతి

పర్వ, నీముఖంబు బాలసూర్యాతప, రక్తకమలసుందరత వహించె.

ఊర్వ—మహారాజా! దేవర పురము వెడలి వచ్చి పెద్దకాల మయినది గదా! ప్రకృతివర్గమునకు నాయెడల నసూయ పుట్టును. కాఁబట్టి మన మింకఁ బట్టణమునకుఁ బోవుదము.

రాజు—సుందరీ! నీయిష్టము.

ఊర్వ—దేవా! దేవరవా రిప్పు డేమార్గమున రాజధానికిఁ బోవలయు నని యభిలషించుచున్నారు?

రాజు—సుందరీ!

పంచ. అమేయకాంతిహృద్యవిద్యుదావళీపతాకమై
సమిద్ధమిశ్రవర్ణశక్రచాపచిత్రరూపమై
విమాన మట్టు లొప్పునీనవీననీరదంబుపై
గమింపఁ గోరుచుంటి నాదుకౌతుకంబు దీర్పవే.

గీతిక. ఎడఁబాసినసహచరిని గలసి మే నెలమిఁ బులకరింప
వెడలె రాజహంస విమానముపయి స్వేచ్ఛను విహరింప.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాదిసాధు
వంశక్షీరనీరాకరరాకాసుధాకరరాచ్చనామాత్యపౌత్రహరితస
గోత్రపవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజ ప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత మగువిక్ర
మోర్వశీయనాటకము చతుర్థాం
కము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

విక్రమోర్వశీయము

పంచమాంకము

[తరువాత సంతోషముతో విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ—ఓహో! యదృష్టవశమునఁ జిరకాలమునకు నాప్రియమిత్రుఁడు తనప్రియురాలయినయుర్వశితోఁ గూడ నందనవనము మొదలయినదేవతారణ్యములయందు విహరించి మరల వచ్చినాఁడు. ఇప్పుడు స్వకార్యానుశాసనమునఁ బ్రకృతిజనులను సంతోషపెట్టుచు రాజ్యము చేయుచున్నాఁడు గదా! ఇతనికిసంతానము లేదన్న దొక్కటియే గాని యింక నేమిలోపము? నేఁడు పర్వదినమని దేవీజనముతోఁ గూడ గంగాయమునా సంగమమున స్నానము చేసి, యిప్పుడే డేరాలోనికి వచ్చినాఁడు. ఇది యతఁ డలంకరించుకొనుసమయము గావున, నేను గూడ మంచిగంధము, పుష్పాలదండలు మొదలగునవి ధరించుకొని యాయనకుఁ దమ్మునివలె నుండెదను. (నడచుచున్నాఁడు) (తెరలో) అయ్యయ్యో! యీవిసనకఱ్ఱమీఁద నునిచి, దుకూలాంచలము పయిని గప్పి, పదిలముగాఁ గొనిపోవుచుండఁగా, దేవిగారిశిరోరత్నమును మాంసఖండ మనుకొని గద్ద యెగురఁదన్నుకొని పోయినది.

విదూ—(చెవియొగ్గి). హా! హా! యెంతకష్టము! అది నామిత్రునికిఁ బ్రేమాస్పదమయినసంగమనీయ మనుచూడామణి గదా! అందుచేతనే యతఁడు తనయలంకారరచన ముగియకుండఁగనే దిగ్గన నాసనమునుండి లేచి యిటు వచ్చుచున్నాఁడు. నేనాతని చెంతకుఁ బోయెదను. (నిష్క్రమించుచున్నాఁడు.) [ప్రవేశము]

[తత్తఱపడుపరిజనముతో రాజు ప్రవేశించుచున్నాఁడు]

రాజు—రేచక! రేచక!

ఆ. వె. బ్రదుకుమీఁదియాస వదలుకొన్నట్టియా, పక్షిదొంగ యెందుఁ బాఱిపోయె?
నెచట లేనిచౌర్య మింతకాలమునకుఁ, బ్రభువుగృహమునందె పక్షి చేసె.

కిరాతి—దేవా! మణి గ్రుచ్చిన హేమసూత్రమును దనముక్కుఁగొనతోఁ బట్టుకొని యాకసమునకు జాదు పూయునట్లు దిరుగుచున్నది.

రాజు—అదిగోఁ! జూచుచున్నాను.

తే. గీ. హేమసూత్రంబు ముక్కున నిఱికి గద్ద, గిఱ్ఱుగిఱ్ఱున మండలాకృతిని దిరుగఁ
గొఱవి ద్రిప్పినలాగున గుండ్రముగను, జుట్టు మణిరాగరేఖ గన్పట్టుచుండె.

ఇప్పుడు చేయవలసిన దేమి?

విదూ—(సమీపించి) మిత్రుఁడా! కనికరింపకు. దీని కింత యాలోచన యేల? అపరాధి శిక్షార్హుఁడే గదా!

రాజు—ఓయీ! నీవు చక్కఁగఁ జెప్పితివి. ఏదీ విల్లు?

యవనిక—ఇదిగోఁ! గొనివచ్చెన దేవ! (నిష్క్రమించుచున్నది)

రాజు—ఏదీ! విహంగాధమము? కనఁబడుట లేదే!

విదూ—ఇదిగో! దక్షిణముగాఁ బాఱి పోవుచున్నది.

రాజు—(నడచి చూచి) ఔఁ. గనఁబడుచున్నది.

పంచ. కరంబు శరంబు మీఱుమానికంబుతో విహంగ మం
బరంబునందుఁ ద్రిమ్మరంగ భాసమాన మయ్యెడున్
హరిన్ముఖం బశోకగుచ్ఛ మాడలన్ ధరించుమా
దిరిన్, దదీయవర్ణనీయదివ్యదీప్తిసంపదన్.

(విల్లు పట్టుకొని యవనిక ప్రవేశించి) దేవా! యివిగో! ధనుర్బాణములు.

రాజు—ఇంక నీవిల్లేల? ఆపాడుగద్ద బాణపథ మతిక్రమించి పోయినది. చూడుము.

తే. గీ. పులుఁగు గడుదూరముగఁ గొనిపోవుకతన, మానికము మిన్కుమిన్కని కానఁబడెడు
మబ్బుఁదెరలమఱుఁగున మాటు పడుచుఁ, గొంచె మగపడునంగారకుండు వోలె.

(కంచుకిని జూచి) లాతవ్య!

కంచు—దేవా! యాజ్ఞాపింపుఁడు.

రాజు—నీవు పోయి, సాయంకాల మాపక్షిదొంగను నివాసవృక్షమున వెదక వలసిన దని పౌరజనులతోఁ జెప్పుము.

కంచు—చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు)

విదూ—మిత్రుఁడా! నీవు విశ్రమింపుము. ఈమణికుంభిలకము నీయాజ్ఞను మీఱి యెక్కడఁ బోఁగలదు?

రాజు—(విదూషకునితోఁ గూరుచుండి) వయస్యా!

తే. గీ. పసగ మెత్తుక పోయినగతినమందుఁ, గడుప్రియము నాకు మణి యనికాదు సుమ్మ
నన్ను నాప్రియురాలితో మున్ను గూర్చి, నట్టిసంగమనీయ మయ్యది వయస్య!

విదూ—మిత్రుఁడా! యెఱుఁగుదును. నీవీవృత్తాంతము నాకు వెనుకనే చెప్పినాఁడవు.

[తరువాత నొకబాణముతోఁ గూడ మణిని బట్టుకొని కంచుకి ప్రవేశించుచున్నాఁడు].

కంచు—(సమీపించి) దేవా! జయము జయము.

ఆ. వె. ఈశరాకృతిని ధరించిన దేవర, వారివీర్యమహిమవలనఁ బక్షి
యట్లు ద్రెవ్వి పడియె సపరాధయోగ్యదండంబుఁ బొంది మణియుతంబుగాను.

(అందఱు నాశ్చర్యపడుచున్నారు.)

కంచు—దేవా! నీళ్ళతోఁ గడిగినయీమణి నెవరి కప్పగింతును?

రాజు—కిరాతీ! దీనిని గొనిపోయి నగలపెట్టెలో నుంపుము.

కిరాతి—దేవా! చిత్తము. (మణిని బుచ్చుకొని నిష్క్రమించుచున్నది.)

రాజు—లాతవ్యా! యీబాణ మెవనిదో యెఱుఁగుదువా?

కంచు—దేవా! దీనిమీఁదఁ బేరుచెక్కినట్లున్నది-గాని, నాచూపు సన్నపరిశీలనము చేయఁజాలదు.

రాజు—అటు లయిన బాణ మిటు తీసికొనిరమ్ము; నేను జూచెదను.

కంచు—అట్లు చేయుచున్నాఁడు.

రాజు—(పేరు చూచి విచారించుచున్నాఁడు.)

కంచు—దేవా! దేవరనియోగమునకై బ్రవర్తించెదను. (నిష్క్రమించుచున్నాఁడు)

విదూ—మిత్రుఁడా! విచారించెద వేమి?

రాజు—ఓయీ! పక్షిని జంపినవాని పేరు వినుము.

విదూ—ఇదిగో! వినుచున్నాను.

రాజు—(చదువుచున్నాఁడు)

తే. గీ. ఊర్వశీగర్భశుక్తిసముద్భవుండు,
పుణ్యమూర్తి పురూరవుపుత్త్రకుండు
కడిఁదివిలుకాఁడు పగఱ నుక్కడఁచువాఁడు
నయిన యాయుష్కుమారుని యాశుగంబు.

విదూ—ఇహీహీ! మిత్త్రుఁడా! నీ వదృష్టవంతుఁడవు. సంతానలాభమున వర్ధిల్లుచున్నావు.

రాజు—మిత్త్రుఁడా! యేమి యీయాశ్చర్యము! నైమిశారణ్యమునఁ దక్క నే నుర్వశి నెప్పుడు నెడఁబాసి యుండలేదు. అప్పుడామెకు వేవిళ్లు లోనగు గర్భావిర్భావచిహ్నము లేమియు నగపడలేదు. ఈ కాను పెట్లు వచ్చెను? అయిన నొకప్పుడు-

క. నలుపెక్కిన చనుముక్కులు, సలలితలవలీదళంబు చాయ మొగము న
త్యలసాలసవీక్షణములుఁ, బొలఁతికిఁ గొన్నాళ్ళు మేనఁ బొడకట్టె సఖా!

విదూ—మిత్త్రుఁడా! యివి మనుష్యస్త్రీధర్మములు. వీనిని దేవతాస్త్రీలయందు విచారింపకుము. వారల చరిత్రములు ప్రభావముచేత నిగూఢములుగ నుండును గదా!

రాజు—ఓయీ! సరే. అది నీవు చెప్పినయట్లే కానిమ్ము. మఱి యామె కుమారుని దాఁచుట కేమి కారణము.

విదూ—మిత్త్రుఁడా! మఱే మున్నది. ముసలి దయిన దని నీవు త్రోసివేయుదు వేమో యని.

రాజు—చాలు నీపరిహాసము. ఆలోచింపుము.

విదూ—మిత్త్రుఁడా! దేవతారహస్యము లెవరు విచారింపఁగలరు?

(కంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు—దేవా! జయము జయము! చ్యవనాశ్రమమునుండి యొకకుమారుని వెంటఁ బెట్టుకొని తాపసస్త్రీ వచ్చి హజారమున వేచి యున్నది. దేవరవారిదర్శనము గోరుచున్నది.

రాజు—ఇద్దఱను శీఘ్రముగాఁ దీసికొనిరా.

కంచు—చిత్తము. దేవా! (నిష్క్రమించి వారిని గొనివచ్చి) పూజ్యురాలా! యిట్లేఁగుము. (అందఱు నడచుచున్నారు.)

విదూ—మిత్రుఁడా! యీపిల్లవాఁడు క్షత్రియకుమారుఁడునువిూ. గృధ్రలక్ష్య చేసి యయినబాణము నితనిదే కావచ్చును. బహుంతరముగా నితఁడు నీపోలిక నున్నాఁడు.

రాజు—మిత్రుఁడా! యాలాగే కావచ్చును. అందుచేతనే

ఉ. ఈతనివంకఁ జూచుడును దృష్టికి బాష్పము లడ్డు వచ్చెడున్;
చేతము ప్రీతియుక్తమయి చెందెఁ బ్రసన్నత; లోనిధైర్యపుం
బాఁతును బెల్లగిల్లెను; జెమర్చుచు నిట్లు వడంకుచున్న నా
యాతను వంతతో నితని నే బిగికౌఁగిటఁ జేర్ప నెంచెదన్.

కంచు—అమ్మా! యక్కడ నిలువుము.

తాపసి—(కుమారునితో నిలుచున్నది.)

రాజు—(సమీపించి) పూజ్యురాలా! నమస్కరించుచున్నాను.

తాప—మహారాజ! చంద్రవంశనిస్తారకుండవు గమ్ము. (తనలో) ఓహో! రాజర్షి యయినయీపురూరవునకు నీయాయుష్కుమారుఁ డౌరసపుత్రుఁడని చెప్పకయే తెలియు చున్నది. (ప్రకాశముగా) బాలకా! మీతండ్రిగారికి నమస్కరింపుము.

కుమా—(చాపగర్భ మగునంజలితో మ్రొక్కుచున్నాఁడు.)

రాజు—కుమార! యాయుష్మాన్ భవ.

కుమా—(స్పర్శమును నిరూపించి తనలో)

క. ఈయనకు సుతుఁడ నని నా, కీయన దండ్రి యని వినుట నింతగఁ బ్రేమం
బాయె; నిఁక నెప్పుడో డిలోఁ, బాయక పెరిఁగినను దండ్రిపయిఁ బ్రియమెంతో.

రాజు—పూజ్యురాలా! నీరాకకుఁ గారణ మేమి?

తాప—మహారాజా! యాలకింపుము. ఆయుష్మంతుఁ డీయాయువు జనన మొందినతోడనే, యేమినిమిత్తమునో యుర్వశి యీశిశువును నాచేతిలోఁ బెట్టినది. వీనికి క్షత్రియకుమారార్హము లయినజాతకర్మాదిసంస్కారములు మహాత్ముఁడు చ్యవన మహర్షి యథావిధిగ నాచరించినవాఁడు. అక్కడనే యీకుమారుఁడు వేదాధ్యయనము చేసి ధనుర్వేదము గూడఁ జక్కగ నభ్యసించినాఁడు.

రాజు—ఓహో! నే నాయనకారణమున సనాథుఁడ నయితిని గదా! తరువాతఁ దరువాత?

తాప — రాజా! యీతఁ డింతకుముందు పుష్పఫలసమిత్కుశాహరణార్థము మునికుమారులతోఁగూడ వనంబున కేగి యచ్చోట నాశ్రమవాసులకు విరుద్ధ మయినయొక కార్యము చేసినాఁడు.

విదూ — (భయముతోడ) ఏమేమి?

తాప — గ్రద్ద యొకటి మాంసఖండము నోటఁ గఱచుకొని వృక్షాగ్రమునఁ గూరుచుండి యుండఁగా నీబాలుఁడు తనబాణమునకు దానిని గుఱి చేసినాఁడు.

విదూ — (రాజును జూచుచున్నాఁడు.)

తాప — తరువాత నమ్మహర్షి యీవృత్తాంతము దెలిసికొని "నీ కప్పగించినకుమారుని మఱల నుర్వశి కప్పగించి ర"మ్మని నా కాజ్ఞాపించెను. మహారాజా! దేవి నుర్వశినిఁ జూడఁ గోరుచున్నాను.

రాజు — పూజ్యురాలా! యటు లయిన నీవు పీఠమును బరిగ్రహింపుము.

తాప — (పరిజనము తెచ్చినపీఠమునఁ గూరుచున్నది.)

రాజు — లాతవ్యా! యుర్వశిని బిలువుము.

కంచు — చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు.)

రాజు — (కుమారునిఁ జూచి) రారమ్మ కుమార!

క. తనయస్పర్శము జనకున, కును సర్వాంగీణసుఖముఁ గూర్చును; దానన్
నను సంతసట్టపెము వే, గను జంద్రనికరము చంద్రకాంతముఁ బోలెన్.

తాప — కుమారా! తండ్రిని సంతోషపఱుపుము.

కుమా — (రాజును జేరుచున్నాఁడు)

రాజు — (కుమారునిఁ గౌఁగిలించుకొని) కుమారా! నీతండ్రికిఁ బ్రియమిత్రుఁడయినయీబ్రాహ్మణునికి నిశ్శంకముగా నమస్కరింపుము.

విదూ — ఏమి? శంక యెందుకు? తపోవనమున నివసించుటచేత నీతనికిఁ గోఁతులతోఁ జాలఁగఁ బరిచయమే గదా!

కుమా — (చిఱునవ్వుతో) అయ్యా! నమస్కరించుచున్నాను.

విదూ — స్వస్తి భవతే, వర్ధతాం భవాన్.

(తరువాత నుర్వశియుఁ గంచుకియుఁ బ్రవేశించుచున్నారు)

కంచు — దేవీ! యిట్టిటు.

ఊర్వ—(కుమారుని జూచి) ధనుష్పాణి యయినయీకుమారుఁ డెవఁడు చెపుమా? మహారాజీతని దనపీఠమునఁ గూరుచుండఁ బెట్టుకొని ప్రేమతోడఁ జుంచు దువ్వుచున్నాఁడు. (తాపసిని జూచి) ఓహో! సత్యవతిని జూచుటచేత నిప్పుడు జ్ఞప్తికి వచ్చినది. ఇతఁడు నాకుమారుఁ డయినయాయువు. ఓహో! పెద్దవాఁ డయినాఁడు.

రాజు—(ఊర్వశిని జూచి) నాయనా! కుమార!

ఆ. వె. పుట్టెఁ డాసతోడఁ బుత్రకు నినుఁ జూడఁ, గోరి నీదుతల్లి చేరవచ్చెఁ
చెప్ప నలవి గానిస్నేహంబుకతనఁ బా, ల్చేఁపు వచ్చి రవిక చినిఁగి పోవ.

తాప—నాయనా! మీతల్లి కెదురు పోవుదము రమ్ము. (అట్లు చేయుచున్నది.)

ఊర్వ—అమ్మా! నీకుఁ బాదాభివందనము సేయుచున్నాను.

తాప—కుమారీ! భర్తృబహుమానము పడయుదువుగాక.

కుమా—అమ్మా! నమస్కరించుచున్నాను.

ఊర్వ—(కొడుకును జేతులతో నెత్తి కౌఁగిలించుకొని) తండ్రీ! పితృసమారాధన తత్పరుండవు గమ్ము. (రాజును సమీపించి) జయము జయము మహారాజ!

రాజు—పుత్రవతీ! కుశలమా? ఇటు రమ్ము. (అర్ధాసన మిచ్చుచున్నాఁడు)

ఊర్వ—దేవా! యందఱమును గూరుచుందము. (అట్లు చేయుచున్నారు.)

తాప— అమ్మాయీ! నీకుమారుఁ డయినయీయాయు విప్పుడు విద్య లెల్ల నభ్యసించి కవచధారణవయస్కుం డయినవాఁడు. కాఁబట్టి నాచేతిలోఁ బెట్టినయీతని నీపెనిమిటిసమక్షమున నీ కప్పగించితిని. నే నిట నాలస్యము చేసిన నాశ్రమధర్మములకు నిరోధము వాటిల్లును. నన్ను శీఘ్రముగాఁ బంపుము.

ఊర్వ—అమ్మా! నిన్నుఁ జూచి చిరకాల మయినది. అందుచేత నీ విప్పుడే పోయెద వన్న నాకు విచార మగుచున్నది. అయిన నాశ్రమధర్మమునకు విరోధముగలిగింపఁ రాదు. కావున నీపోకడకు సమ్మతింపవలసె. పునర్దర్శన మిమ్ము.

రాజు—పూజ్యురాలా! చ్యవనునకు నానమస్కారము దెలుపుము.

తాప—అట్లే తెలిపెదను.

కుమా—అవ్వా! నీవు వెళ్లెదవేని నన్నుఁ గూడ నాశ్రమమునకుఁ దీసికొని పో.

రాజు—కుమార! నీవు పూర్వాశ్రమము నచటఁ గడపితివి. ఇది ద్వితీయాశ్రమానుష్ఠానమునకు సమయము గదా!

తాప—నాయనా! మీతండ్రిగారిమాటచొప్పున నుండుము.

కుమా—అవ్వా! మరి యేలా గయిన—

తే. గీ. నేను జనపించె మల్లన నిమురు చుండ, హాయిగా నెప్పు డొడిలోన నాద మలచి
కన్ను మూసెడునామణికంఠరుచిర, మైనపెంపుడునెమిలి నా కంప వలయు.

తాప—నాయనా! నీ కాలాగే పంపెదనోయి. మీ కందఱకు శుభ మగుఁగాక.

దంపతులు—పూజ్యురాలా! నమస్కరించుచున్నాము.

తాప—భద్రి మగుఁగాక. (నిష్క్రమించుచున్నది)

రాజు—(ఊర్వశిని జూచి) సుందరీ!

ఆ. వె. నేను బుత్రవంతు లైనవారలలోన, మొదటివాఁడ నీసుపుత్త్రువలన
వలశచీతనూజుఁ డైనజయంతుని, వలన దివిజలోకభర్త వోలె.

ఊర్వ—(తలఁచుకొని యేడ్చుచున్నది)

రాజు—(తొట్రుపడుచు)

చ. లలనరో! నాదువంశము నిలంబడె నంచు మహాప్రమోదవీ
చుల నిటు లోల లాడుతఱిఁ జోద్యము నీవు మదీయసన్నిధిన్
జలజల రాలుబాష్పకణజాలముచేతను నీపయోధరం
బులఁ బునరుక్త హారనటులు ముత్తెపుఁజేరులు దాల్చె దేటికిన్?

(ఆమె కన్నీళ్ళను దుడుచుచున్నాఁడు)

ఊర్వ—దేవా! చిత్తగించి యాలకింపుము. మొదట నేను బుత్త్రునిఁ జూచిన సంతోషమునఁ బరాకుపడితిని గాని, యిప్పుడు దేవరవారు ప్రస్తావవశమున దేవేంద్రుని మాట దలపెట్టుటచేత నాకు జ్ఞప్తికి వచ్చినది.

రాజు—దేవీ! యది యేమి?

ఊర్వ—ప్రాణవల్లభ! పూర్వము నేను మీయందు మనసు దగిలియుండఁగా, మహేంద్రుఁడు నా కిట్టు లాజ్ఞాపించినాఁడు.

రాజు—దేవీ! యే మని?

ఊర్వ—మహారాజా! చిత్తగింపుము. అప్పు డామహేంద్రుఁడు నన్నుఁ జూచి "యుర్వశీ! నీయందుఁ దనకు వంశాంకురముగా నుద్భవించెడుకుమారుని మొగ మారాజేంద్రుఁడు చూచినతోడనే నీవు మరల నాయొద్దకు రావలయు" నని యానతిచ్చెను.

అందుకతన నేను దేవరవియోగమున కోర్వలేక, యీబిడ్డనికి విద్యాభ్యాసము కూడ నావశ్యకమే కదా యని, జననమయినతోడనే దేవరకంటఁ బడకుండ నీకుమారుని, వదలలేక వదలలేక, కడుప్రయాసమునఁ జ్యవనాశ్రమమందుఁ బూజ్యురాలయిన యాసత్యవతి చేతిలోఁ బెట్టి వచ్చితిని. ఆమెయుఁ బితృసమారాధనసమర్థ మయిన యీడు వచ్చినదని యాలోచించి దీర్ఘాయు వయిన యీయాయువును నాకు మరల నప్పగించి పోయినది. కాఁబట్టి దేవా! తమతోడిసాంగత్యము నా కింతమట్టునకే. ఇఁక మీఁద ఋణము లేదు.

రాజు—(మూర్ఛిల్లుచున్నాఁడు)

ఊర్వ—మహారాజా! యూఱడిల్లు మూఱడిల్లుము.

విదూ—అయ్యయ్యో! యేమిగతి యేమిగతి!

రాజు—(ఊఱడిల్లి నిట్టూర్పుపుచ్చి) అన్నా! దైవ మెంతమే లోర్వ దాయెనే. (ఊర్వశి జూచి)

చ. కొడుకుమొగంబుఁ జూచి మదిఁ గుందక యూఱటఁ జెంది యుండఁగాఁ
బడఁతుక! నీవియోగ మనివార్యత నిప్పుడ సంభవించెఁగా;
మిడిమిడిగ్రీష్మతాపము శమింప నవాంబుదవృష్టిఁ గాంచి యు
ప్పెడుతఱిఁ జెట్టుపైఁ బిడుగు భీకరభంగిని బడ్డకైవడిన్.

విదూ—దేవా! యీశుభము ననర్థావహముగా నేను దలఁచుచున్నాను. నీవింకఁ నారచీరలను గట్టుకొని యరణ్యమున కరుగవలయును.

ఊర్వ—మహారాజా! నేను మందభాగ్యురాలను, విద్యావినయసంపన్నుఁ డయిన కుమారునిముద్దుముచ్చటలు చూడకయే స్వర్గలోకమునకుఁ బోవలసినదాన నయినాను; నన్నాఱడింపుఁడు.

రాజు—సుందరీ! నీ వీలాగున విచారింపఁ గూడదు,

చ. పరులయధీన మాబ్రతుకువారికి వింత లటే వియోగముల్?
జరుపఁ దరంబె వారికి నిజప్రియముల్? నిలు మింద్రునానతిన్;
దరుణిరో! నేను నీధరణిఁ దావకపుత్త్రకుఁ డైనయాయువం
ధురమతి నిల్పి పోదు మృగయూథశరణ్య కరణ్యభూమికిన్.

కుమా—నాయనగారూ! మహావృషభముపయి వేయవలసినభారము లేఁగదూడ మీఁద వేయఁ జూతురా?

రాజు—(కుమారుని దువ్వుచు) నాయనా! యీలాగునఁ గాదోయి.

చ. కలభమె యయ్యు నొర్చెదును గంధగజం బితరంబు లైనకుం
భుల, మఱి క్రొఁ జెలాగ్రచువిసముం బరికింప నుదగ్రవేగమే!
యిలఁ బరిపాలనంబు నొనరించును బాలకుఁ డయ్యు క్షత్రియుం
డలఘుమజాతి గాక వయసా నిజకార్యభరోద్వహం బగున్?

లాతవ్య! కుమారుఁ డయినయీయువునకు రాజ్యాభిషేకోపకరణములు సమకూర్ప వలయు నని మాయానతిగా మంత్రివర్గముతోఁ జెప్పుము.

కంచు—చిత్తము దేవా! (దుఃఖముతో నిష్క్రమించుచున్నాఁడు)

అందఱు—(దృష్టిప్రతిబంధము నభినయించుచున్నారు.)

రాజు—(పైకిఁ జూచి) ఏమిది! మబ్బు లేనియాకసమున మెఱుపు మెఱయు చున్నది.

ఊర్వ—ఓహో! భగవానుఁడు నారదుఁడు.

రాజు—(నిపుణముగాఁ జూచి) ఔ నీమహానుభావుఁడు నారదుఁడే.

చ. మకమక లేనిచంద్రకళమాదిరి జన్నిదముల్ దనర్పఁ, గో
రకములఁ గేరుముత్తెపుసరంబు లురంబున వ్రేల, రోచనా
నికషపిశంగసన్నకమనీయజటాపటలంబుతో మనో
జ్ఞకకనకప్రరోహ మగుజంగమకల్పనగంబుఁ బోలెడున్.

దేవీ! యీయన కర్ఘ్యము గొనిరమ్ము.

ఊర్వ—(అట్లు చేసి) ఇదిగో! మహర్షి కర్ఘ్యము.

[తరువాత నారదుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

నార—విజయతాం మధ్యమలోకపాలః.

రాజు—(ఊర్వశిచేతనుండి యర్ఘ్యము పుచ్చుకొని) మహాత్మా! నమస్కరించు చున్నాను.

ఊర్వ—మునీంద్రా! వందనము చేయుచున్నాను.

నార—అవిరహితౌ దంపతీ భూయాస్తామ్.

రాజు—(తనలో) ఈయనయాశీర్వాదమహిమచేత మాకు వియోగము గాకుం

డునా? (కుమారునిఁ గౌఁగిలించుకొని ప్రకాశముగా) కుమార! మునీంద్రునకు నమస్కరింపుము.

కుమా—(మ్రొక్కుచున్నాఁడు.)

నార—దీర్ఘాయుష్మాన్.

రాజు—స్వామీ! మీ రీయాసనమున వసుచేయుఁడు.

(నారదుఁడు కూరుచున్నాఁడు. అందఱు నాయన ననుసరించి కూరుచున్నారు)

నార—రాజా! మహేంద్రునిసందేశ మాలకింపుము.

రాజు—స్వామీ! సావధానుఁడఁగా నున్నాను.

నార—రాజా! వినుము. ప్రభావముచేత నింద్రుఁడు సర్వము నెఱింగినవాఁడయి తపోవనంబునకుఁ బోవఁ గృతనిశ్చయుఁడ వయియున్న నీ కాయన యిట్లు లాజ్ఞాపించుచున్నాఁడు.

రాజు—స్వామీ! యామహామహునియాజ్ఞ యేమి?

నార—రాజా! భావికాలమున దేవాసురులకు యుద్ధము కాఁగల దని త్రికాలవేదు లయినమహర్షులవలన నాతఁడు దెలిసికొని, యాయుద్ధమున నీసాహాయ్య మావశ్యకము కావున, నీ వస్త్రసన్న్యాసము చేయ వల దనియు యావజ్జీవము నీ కీయుర్వశి సహధర్మచారిణి యయి యుండెడు ననియు సెల విచ్చినాఁడు.

ఊర్వ—అమ్మయ్యా! యిప్పుడు నాహృదయశల్య మూడఁ బెఱికినట్లే యున్నది.

రాజు—స్వామీ! మహానుగ్రహము. నేను మహేంద్రున కాజ్ఞాను వర్తి నేగదా!

నార—రాజా! యది యుక్తమే.

క. నీయిష్టము దేవేంద్రుఁ, డాయనయిష్టంబు నీవు ననుకూలముగాఁ
జేయుదురు సూర్యుఁ డనలుని, నాయనలుఁడు సూర్యుఁ బోలెనన ట్లెల్లపుడున్

(ఆకాశము వంకఁ జూచి) రంభా! కుమారుఁ డయినయాయూవునకు యౌవరాజ్యాభిషేకార్థము తానుగ దేవేంద్రుఁడు సిద్ధపఱిచినసంభారములు దీసికొనిరా,

రంభ—(అవినయముగాఁ బ్రవేశించుచున్నది)

రంభ—ఇవిగో! యభిషేకసంభారములు.

నార—ఈయాయుష్మంతుని భద్రసింహాసనమునఁ గూరుచుండఁ బెట్టుము.

రంభ—కుమారా! యిటు రమ్ము. (కుమారుని భద్రాసనమునఁ గూర్చుండఁ బెట్టుచున్నది.)

నార—(కుమారునిశిరస్సునఁ గలశము వంచి) రంభా! యీతనికిఁ దక్షిణాదిని నిర్వర్తింపుము.

రంభ—(యథోక్తముగా నిర్వర్తించి) కుమారా! మహర్షికిని నీతల్లిదండ్రులకును నమస్కరింపుము.

కుమా—(యథాక్రమముగా నమస్కరించుచున్నాఁడు.)

నార—స్వస్తి భవతే.

రాజు—కులధురంధరో భవ.

ఊర్వ—నాయనా! మీతండ్రిగారిదీవన ఫలించుఁ గాక.

(తెరలో నిద్దఱు వైతాళికులు)

ప్రథముఁడు—జయము జయము యువరాజ!

చ. జలరుహగర్భ నాయమరసంయమి యత్రియుఁ బోలె, నత్రి నా
కలువలరాయఁడుం బలెను, గల్వలరాయనిఁ దన్బుధుండునుం
బలె, బుధు నీమహాప్రభువుభాతిని, లోకమనోజ్ఞసద్గుణా
వళులను దండ్రిఁ బోలుము; భవత్కుల మెల్లను బొందు దీవనల్.

ద్వితీ—

చ. అనఘచరిత్ర! యుక్తములయందు మహోన్నతి నుర్వి యేలునీ
జనకు, నకంప్యధైర్యగుణశాలిని నిన్నును జేరి, యిప్డు డీ
ఘనతరరాజ్యలక్ష్మి యధికంబుగ శోభ వహించె మంచుఁగొం
డను జలధిన్ విభక్తసలిలం బగుచుం దగుగంగకైవడిన్.

రంభ—(ఊర్వశిని జూచి) సఖీ! నీ సదృష్టవంతురాలవు. భర్తృవిరహంబునకుఁ దలఁగి పుత్రునియౌవరాజ్యమహిమచేత వర్ధిల్లుచున్నావు.

ఊర్వ—చెలియా! యీమహోత్సవము మన కందఱకు సమానమేగదా!

రంభ—(కుమారునిచేయి పట్టుకొని) అబ్బాయీ! మీ పెదతల్లిగారికి నమస్కరింతువుగాని రమ్ము.

కుమా—(లేవఁబోవుచున్నాఁడు)

రాజు—ఉండుము. మన మందఱముఁ గూడ నామెయొద్దకుఁ బోవుదము.

నార—ఇదిగో! నిప్పుడు—

ఆ. వె. అధిప! నీకుమారుఁ డైనయాయువుయశేష, రాజ్యలక్ష్మిఁ జూచి పూజ్య దేవ
సేన కెల్ల నిందుృచే నభిషిక్తుఁ డై, యలరునలకుమారుఁ దలఁచు చుంటి.

రాజు—మహేంద్రునిచే ననుగ్రహింపఁబడితిని.

నార—రాజా! నీ కింక దేవేంద్రుఁడు చేయ వలసినప్రియం జేమి?

రాజు—స్వామీ! యాయన ప్రసన్నుఁ డగుటకంటెఁ బ్రియంజేమి? అయిన
నిట్లగుఁ గాక.

చంప. పరస్పరంబు గిట్ట కొక్కపట్టు చేరనట్టిశ్రీ
సరస్వతుల్ స్వకీయ వైరశత్రుభావ మంతయున్
దిరస్కరించి యింకఁ దాము నెమ్మి సజ్జనాళిమం
దిరమ్ములం దిరమ్ముగాను నిల్చియుండుృ గావుతన్.

మరియు—

క. ఎల్లరుఁ గడచుతఁ గష్టము
లెల్లరుఁ గళ్యాణములను వీక్షింతురు గా
కెల్లరు నష్టము లొందెడు
మెల్లరు సర్వత్రి రహి నహింతురు గాతన్.

ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాదిసాధు
వంశక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్రిహరితస
గోత్రి పవిత్రిగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజప్రిధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత మగువిక్రి
మోర్వశీయనాటకము పంచమాం
కము.